# విశాల భారతి

07-06-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 153




## మల్లన్నకు దారేది?

- ఏడాది దాటినా ఉత్తర్వులు లేవు
- దట్టమైన అడవి, మలుపులతో ప్రయాణం కష్టం
- రూ.18,500 కోట్లతో 87 కి.మీ కారిడార్ ప్రతిపాదన

02

## మంత్రి పదవి దక్కేనా?

- మంత్రి పదవి కోసం రాహుల్ గాంధీని కలిసిన రాజగోపాల్ రెడ్డి
- మంత్రివర్గ విస్తరణలో తనకు అవకాశం కల్పించాలని విన్నపం
- సోదరుడు ఇప్పటికే మంత్రి కావడంతో ఒకే కుటుంబానికి రెండు పదవుల చిక్కు
- తన రాజకీయ అనుభవం, పార్టీ కోసం చేసిన కృషిని వివరించిన ఎమ్మెల్యే
- కష్టపడిన వారికి న్యాయం చేస్తామని రాహుల్ హామీ
- అధిష్ఠానంతో నేరుగా లాబీయింగ్ చేయడంతో రాజకీయాల్లో చర్చ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ విస్తరణ కోలాహలం ఊపందుకుంది. మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హస్తిన వేదికగా శనివారం జరిపిన కీలక భేటీ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో సరికొత్త చర్చకు దారితీసింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. పైకి ఇదొక సాధారణ భేటీగా కనిపిస్తున్నప్పటికీ, రాష్ట్రంలో త్వరలో జరగబోయే కేబినెట్ విస్తరణలో తన ఉనికిని చాటుకోవడానికే ఈ సమావేశం జరిగినట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా తెలంగాణ మంత్రివర్గంలో చోటు ఆశిస్తున్న అగ్రనేతల్లో రాజగోపాల్ రెడ్డి ఒకరు కావడంతో మిగతా 4లో..

# పొలిమేర్లు కూడా దాటవ్వు కిషన్ రెడ్డి

- రూ. 2,400 కోట్లతో కోహెడలో ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం
- నిధులు తేకుంటే తెలంగాణలో పర్యటించవద్దని హెచ్చరిక
- మెట్రో, రింగ్ రోడ్డు నిధుల విషయంలో కేంద్రం నిర్లక్ష్యం
- సేకరణపై కేంద్రం తీరును ఎండగడతామని సీఎం స్పష్టీకరణ
- కూరగాయలు, పండ్ల సాగుతో రైతులకు అధిక ఆదాయం లక్ష్యం
- కేంద్రం అడ్డుపడినా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని హామీ




విశాలభారతి, స్టేట్ బ్యూరో: రంగారెడ్డి జిల్లా కోహెడ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ అనుసరిస్తున్న తీరు అడ్డగోలుగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి నిధులు సాధించడంలో విఫలమైతే పొలిమేర్లు దాటనివ్వబోమని హెచ్చరికలు జారీ చేశారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పండ్ల మార్కెట్ శంకుస్థాపన చేసిన తర్వాత ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. మాటలకే పరిమితం కాకుండా చేతల్లో సత్తా చూపిస్తామని, తెలంగాణ ప్రగతికి అడ్డంకులు సృష్టిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. 02



## పవన్ కల్యాణ్‌పై కవిత కబ్జా బాణం!



- భూమి చెరువుది అని తేలితే రాసిస్తానన్న పవన్ వ్యాఖ్యల గుర్తు
- ఆ భూమి 'చెరువు శిఖం' అని కవిత స్పష్టీకరణ
- వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్
- ప్రస్తుత పాలనను కొండల్, తిరుపతి, రేవంత్ రెడ్డి అని ఎద్దేవా
- సామాన్యులకే కూల్చివేతలు, పెద్దలను వదిలేశారని మండిపాటు
- ఆరోపణలు కుట్ర, తమ భూమి చట్టబద్ధమని స్పష్టం

05

## రేవంత్ రెడ్డిని మళ్లీ ఓడగొడుతాం

- వచ్చే ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ఓటమి ఖాయం
- మహబూబ్‌నగర్‌లో మళ్లీ బీఆర్ఎస్ హవా
- రేవంత్ భాష, మాటలు చిల్లరగా ఉన్నాయి
- పాలమూరుకు ఏమీ చేయలేకే రేవంత్ ఫ్రస్టేషన్
- కాంగ్రెస్ పాలనలో కొత్తగా ఒక్క ఎకరాకు సాగునీరు లేదు
- చర్చకు సిద్ధమని, రేవంత్ స్థాయి కేసీఆర్ కాదని స్పష్టం


03



## నల్లగొండ ధాన్యం కొనుగోళ్ల గందరగోళం

- నల్లగొండ ధాన్యం కొనుగోళ్ల గందరగోళం
- 87 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తిగా నిలిచాయి
- ముందస్తు ప్రణాళికా లోపంతో రైతుల పడిగాపులు
- మిల్లర్లపై కేసులతో సేకరణకు తీవ్ర ఆటంకం
- కేంద్రాల్లో ధాన్యం తడిసి, రైతులు భారీగా నష్టం
- మంత్రుల పర్యటనలతో క్షేత్రస్థాయిలో మార్పు లేదు
- నగదు కోసం రైతులు రోడ్లపైకి వచ్చి నిరసనలు

03






## కాలనాగులతో జాగ్రత్త

- 2028లో తిరిగి కేసీఆర్ ప్రభుత్వమే వస్తుంది
- మాతృభూమిపై ప్రేమను అభినందించారు
- త్యాగాల పునాదులపైనే తెలంగాణ ఏర్పడింది
- తెలంగాణను 'అన్నపూర్ణ'గా మార్చింది కేసీఆరే
- తెలంగాణ సంస్కృతికి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చాం

03

## జాబ్ కంటే మిర్చి బండి బెటర్

- ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేచి చూడకండి
- ఉద్యోగుల కంటే వ్యాపారుల సంపాదన ఎక్కువ
- గోకుల్ చాట్ వంటి చిన్న వ్యాపారాల్లో లక్షల్లో ఆదాయం

02



## సెమీకండక్టర్ హబ్‌గా తెలంగాణ

- తెలంగాణను గ్లోబల్ హబ్‌గా మార్చేలా మలేషియాతో చర్చలు
- చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్ తయారీలో ఒప్పందం
- మలేషియా సాయంతో మన యువతకు అంతర్జాతీయ శిక్షణ
- హైదరాబాద్ మౌలిక వసతులపై మలేషియా బృందం సంతృప్తి
- రాష్ట్రంలో యూనిట్ల స్థాపనకు మలేషియా కంపెనీల ఆసక్తి
- పారిశ్రామిక వృద్ధిలో అంతర్జాతీయ భాగస్వామ్యానికి ప్రాధాన్యత



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ అంతర్జాతీయ సాంకేతిక ముఖచిత్రంపై సరికొత్త మైలురాయి ఆవిష్కృతమైంది. సెమీకండక్టర్ పరిశ్రమల స్థాపనకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమైన ప్రాంతమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా మలేషియాకు చెందిన ప్రముఖ కంపెనీలను ప్రోత్సహించాలని ఆ దేశ ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందాన్ని ఆయన కోరారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా, రాబోయే రోజుల్లో సాంకేతిక రంగంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేలా ప్రపంచస్థాయి సదుపాయాలతో కూడిన సెమీకండక్టర్ 'ఎకో సిస్టం'ను అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని వివరించారు. మలేషియా దేశంలోని కీలక ప్రాంతమైన పెనాంగ్ డిప్యూటీ సీఎం వైబీ జగదీప్ సింగ్ దియో నేతృత్వంలోని ఆ దేశ అత్యున్నత స్థాయి ప్రతినిధుల బృందం శనివారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ఈ సందర్భంగా ఇరు ప్రాంతాల మధ్య వ్యాపార, పారిశ్రామిక బంధాన్ని బలోపేతం మిగతా 3లో..

# జాబ్ కంటే మిర్చి బండి బెటర్

- ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేచి చూడకండి
- ఉద్యోగుల కంటే వ్యాపారుల సంపాదన ఎక్కువ
- గోకుల్ చాట్ వంటి చిన్న వ్యాపారాల్లో లక్షల్లో ఆదాయం
- ఖాళీగా ఉండటం కంటే చిన్న వ్యాపారాలే మేలు
- స్వయం ఉపాధితో త్వరగా ఆర్థికంగా ఎదగవచ్చు
- ఏ పనినైనా గౌరవించి సొంతంగా ఎదగాలని సూచన

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ సమాజంలో నిరుద్యోగ సమస్య తీవ్రతరం అవుతున్న తరుణంలో, యువత కేవలం ప్రభుత్వ కొలువుల కోసమే ఏళ్ల తరబడి వేచి చూస్తూ కాలం వృథా చేసుకోవద్దని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు హితవు పలికారు. శనివారం వరంగల్ నగరంలో పర్యటించిన ఆయన మీడియా ప్రతినిధులతో ప్రత్యేకంగా మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువత తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని, స్వయం ఉపాధి రంగాల వైపు అడుగులు వేయడం ద్వారా ఆర్థికంగా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని స్పష్టం చేశారు. కేవలం ఉద్యోగాల వేటలోనే ఉండిపోకుండా సొంతంగా వ్యాపార సామ్రాజ్యాలను స్థాపించుకునే దిశగా అడుగులు వేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. సమాజంలో కష్టపడే తత్వం ఉంటే ప్రభుత్వ ఉద్యోగుల కంటే మిర్చి బండి, బజ్జీల బండి నిర్వహించేవారే అత్యధికంగా సంపాదించే అవకాశాలు ఉన్నాయని ఎంపీ విశ్లేషించారు. చదువుకున్న చదువుకు తగిన కొలువు రాలేదని నిరాశ చెందడం కంటే, లభించిన వనరులతో చిన్న తరహా వ్యాపారాలు ప్రారంభించడం ఉత్తమమని పేర్కొన్నారు. ఏ ఉద్యోగం లేకుండా ఖాళీగా ఇంట్లో కూర్చోవడం కంటే, నలుగురికి ఆదర్శంగా నిలిచేలా స్వయంగా ఒక వ్యాపారాన్ని ఏర్పాటు చేసుకోవడం ఎంతో గౌరవప్రదమైన విషయమని అభిప్రాయపడ్డారు. శ్రమను నమ్ముకున్న ఏ వ్యక్తి కూడా జీవితంలో ఓడిపోడని, వ్యాపార రంగంలో ఉన్న అపారమైన అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాల ద్వారా వచ్చే స్థిర ఆదాయం కంటే స్వయం ఉపాధి మార్గాల ద్వారా లక్షల్లో సంపాదించే వీలుందని రఘునందన్ రావు ఉదాహరణలతో వివరించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో చిన్న వ్యాపారాలుగా ప్రారంభమై, నేడు బ్రాండ్లుగా మారిన ఎన్నో సంస్థల విజయగాథలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. కేవలం ఒక చిన్న కౌంటర్ ద్వారా వ్యాపారాన్ని మొదలుపెట్టి, నేడు రోజువారీ ఆదాయాన్ని ఊహించని స్థాయికి తీసుకెళ్లిన ఎందరో సామాన్యులు మన కళ్ల ముందే ఉన్నారని గుర్తుచేశారు. అంకితభావంతో పనిచేస్తే చిన్న వ్యాపారాలు సైతం కార్పొరేట్ సంస్థలకు దీటుగా లాభాలను ఆర్జించి పెడతాయనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. నగరంలోని ప్రముఖ వ్యాపార కేంద్రాలైన పానీపూరి దుకాణాలు, గోకుల్ చాట్ వంటి ప్రసిద్ధ ఆహార కేంద్రాల నిర్వహణ ద్వారా రోజుకు లక్ష రూపాయల వరకు ఆదాయం లభిస్తోందని ఎంపీ వెల్లడించారు. బాహ్య ప్రపంచానికి ఇవి చిన్న వ్యాపారాలుగా కనిపించినప్పటికీ, వాటి వెనుక ఉన్న ఆర్థిక టర్నోవర్ అత్యంత భారీగా ఉంటుందని విశ్లేషించారు. వినియోగదారుల రుచికి, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ వ్యాపారాలు సాగిస్తే తిరుగులేని ఆదరణ లభిస్తుందని చెప్పారు. చదువుకున్న యువత ఇటువంటి రంగాలలో ఆధునిక మెళకువలను ప్రదర్శిస్తే మరింత అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజంలో కొందరు వ్యక్తులు బజ్జీల బండి పెట్టుకోవడాన్ని ఒక అవమానంగా, తక్కువ చూపు చూస్తున్నారని రఘునందన్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. బజ్జీల బండి పెట్టుకోవడం కూడా ఒక ఉద్యోగమేనా అంటూ ఎద్దేవా చేసేవారికి యువత తమ విజయాలతో సమాధానం చెప్పాలని కోరారు. ఏ పని చేయకుండా కాలం గడపడం కంటే, సొంతంగా కష్టపడి నాలుగు పైసలు సంపాదించుకోవడం ఎంతో ఉత్తమమైన మార్గమని స్పష్టం చేశారు. ఏ వృత్తి కూడా తక్కువ కాదని, చేసే పనిపై గౌరవం, పట్టుదల ఉంటే ఆ చిన్న వ్యాపారమే భవిష్యత్తులో పెద్ద పరిశ్రమగా మారే అవకాశం ఉంటుందని ఉద్ఘాటించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ రంగంలో కొలువుల సంఖ్య అత్యంత పరిమితంగా ఉందని నిరుద్యోగ యువత గ్రహించవలసిన అవసరం ఎంతైనా ఉంది. లక్షలాది మంది పోటీ పడే నోటిఫికేషన్లలో కేవలం కొద్దిమందికి మాత్రమే ఉద్యోగాలు లభించే అవకాశం ఉంటుంది. మిగిలిన నిరుద్యోగులు నిరాశకు లోనై మానసిక వేదనను అనుభవించడం కంటే, తక్షణమే ప్రత్యామ్నాయ స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించడం బుద్ధి కుశలత అనిపించుకుంటుంది. ప్రభుత్వం అందించే వివిధ రకాల సబ్సిడీలు, రుణ సదుపాయాలను వినియోగించుకుంటూ యువత వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఎంపీ ఆకాంక్షించారు. మారుతున్న సమాజంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి చిన్న వ్యాపారాలను కూడా ఎంతో ఆకర్షణీయంగా మార్చుకునే వీలుంది. సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా సరికొత్త ఆలోచనలతో ఫుడ్ కోర్టులు, మొబైల్ టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేస్తూ నేటి తరం యువత సంచలనాలు సృష్టిస్తోంది. ఇటువంటి స్వయం ఉపాధి విప్లవం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు విస్తరించవలసిన అవసరం ఉంది. శారీరక శ్రమకు వెరవకుండా, నూతన ఆవిష్కరణలతో ముందుకు సాగే యువతకు మార్కెట్లో ఎల్లప్పుడూ తిరుగులేని డిమాండ్ ఉంటుందని రఘునందన్ రావు పేర్కొన్నారు. యువతలో ఉన్న నైపుణ్యాలను గుర్తించి, వారిని వ్యాపార రంగానికి వైపు ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు సైతం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాల్సి ఉంది. కేవలం ఉద్యోగాల కల్పనపైనే కాకుండా, స్వయం ఉపాధిని ఎంచుకునే వారికి అవసరమైన శిక్షణా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి. బ్యాంకు అధికారుల చుట్టూ తిరగకుండా సులభతరంగా రుణాలు అందేలా చూస్తే, మరింత మంది యువతీ యువకులు సొంత కాళ్లపై నిలబడటానికి ఉత్సాహం చూపిస్తారు. సమాజంలో ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి చిన్న తరహా వ్యాపారాల పాత్ర ఎంతో కీలకమైనదని గుర్తించాలి. వరంగల్ నగరానికి ఉన్న చారిత్రక ప్రాశస్త్యం, ఇక్కడి వ్యాపార అవకాశాలను కూడా ఎంపీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. స్థానికంగా లభించే వనరులను వాడుకుంటూ యువత ఇక్కడే సరికొత్త స్టార్టప్‌లను ప్రారంభించవచ్చని సూచించారు. పెద్ద పెద్ద నగరాలకు వలస వెళ్లడం కంటే, సొంత ప్రాంతాల్లోనే చిన్న చిన్న వ్యాపార యూనిట్లను నెలకొల్పి స్థానికులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడం గొప్ప విషయమన్నారు. నిరుద్యోగులు తమ ఆలోచనల పరిధిని పెంచుకుని, సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నప్పుడే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపేలా రఘునందన్ రావు పలు కీలక సూచనలు చేశారు. సమాజం ఏమనుకుంటుందో అనే సంకోచాలను వీడి, నచ్చిన రంగంలో కష్టపడి పనిచేసేందుకు సిద్ధం కావాలన్నారు. నేటి చిన్న వ్యాపారస్తులే రేపటి లీడర్లుగా మారతారని, ఆ నమ్మకంతో ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే జీవిత పరమార్థం కాదని, స్వయం ఉపాధితో ఆర్థిక స్వాతంత్ర్యం పొందడం కూడా అంతే ముఖ్యమని చెబుతూ ఆయన తన మీడియా సమావేశాన్ని ముగించారు.

# రైతుబంధుకు వేళాయే సారు

- వానాకాలం రైతుబంధు నిధులు జమ చేయాలి
- రైతు భరోసా కోసం భరోసాతో రైతుల ఎదురుచూపులు
- మృగశిర కార్తె వరకు రైతుబంధు అందజేయాలి
- కాంగ్రెస్ చెప్పింది ఎకరాకు 12 వేలు కాదు
- బీఆర్ఎస్ ఇచ్చిన 10 వేలైన ఇయ్యు సారు
- సోషల్ మీడియా జిల్లా నాయకులు మజర్



**ఆదిలాబాద్ , విశాలభారతి:** తెలంగాణలో వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతుల ఖాతాల్లో తక్షణమే రైతుబంధు నిధులు జమ చేయాలని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా నాయకులు మజర్ డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బంధు పథకం ద్వారా ప్రతి ఎకరానికి సంవత్సరానికి రూ.10,000 పెట్టుబడి సాయం అందించగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా సోషల్ మీడియా నాయకులు మజర్ తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతులకు మరింత మేలు చేస్తామని ఈసారి రైతుబంధు 10 వేలే వస్తది, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 12 వేలు వస్తదని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక రైతు బంధు పేరును రైతు భరోసాగా మార్చి ప్రచారం చేసుకోవడమే తప్ప రైతులకు సకాలంలో నిధులు అందించడంలో విఫలమైందని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా పథకం కింద ఎకరానికి సంవత్సరానికి రూ.12,000 ఇస్తామని చెప్పినా, అమలులో తీవ్ర జాప్యం జరిగిందని పేర్కొన్నారు. 2025లో విడతల వారీగా నిధులు విడుదల చేయగా, రైతులు నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే ప్రభుత్వం 2025లో రూ.9,000 కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ, రైతులు సకాలంలో పెట్టుబడి సాయం కోసం ఎదురు చూడాల్సి వచ్చిందన్నారు. మృగశిర కార్తె వరకు ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో అయిన రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం, రైతుల విషయంలో మాటలు కాకుండా చేతల్లో చూపాలని మజర్ డిమాండ్ చేశారు. ఒకపక్క రైతుబంధు వేయక, ఒక పక్క కష్టపడి పండించిన పంటలను కొనుగోలు చేయక కేవలం కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రస్తుత వానాకాలం సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్రంలోని అర్హులైన రైతులందరికీ వెంటనే రైతు భరోసా నిధులు జమ చేసి, రైతుల ఆందోళనకు ముగింపు పలకాలని కోరారు.

# మల్లన్నకు దారేది?

- ఏడాది దాటినా ఉత్తర్వులు లేవు
- దట్టమైన అడవి, మలుపులతో ప్రయాణం కష్టం
- రూ.18,500 కోట్లతో 87 కి.మీ కారిడార్ ప్రతిపాదన
- ఎత్తులో నిర్మాణంతో జంతువులకు భద్రత
- హైదరాబాద్, విజయవాడ నుంచి నేరుగా, సురక్షిత ప్రయాణం
- కేంద్రంపై రాష్ట్రాల ఒత్తిడి అవసరం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



నల్లమల అడవుల గుండెల్లో కొలువైన శ్రీశైల మల్లికార్జున స్వామి భక్తుల కలల ప్రయాణం ఇప్పట్లో సాకారమయ్యేలా కనిపించడం లేదు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ద్వితీయ క్షేత్రంగా, అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన భ్రమరాంబికా అమ్మవారి నిలయంగా ఏకకాలంలో విరాజిల్లుతున్న ఏకైక పరమ పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీశైలం. ప్రతి ఏటా కోట్లాది మంది శైవభక్తులు తరలివచ్చే ఈ దివ్యధామానికి చేరుకోవడానికి ప్రస్తుతం నల్లమల అభయారణ్య ఘాట్ రోడ్డు ఒక్కటే ఏకైక మార్గంగా ఉంది. భక్తుల ప్రయాణ కష్టాలను తీరుస్తూ నల్లమల కొండలపై సుమారు రూ.18,500 కోట్ల భారీ వ్యయంతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తామని పాలకులు ప్రకటించి ఏడాది గడిచినా ఆచరణలో అడుగులు ముందుకు పడలేదు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుపై సూత్రప్రాయ ప్రకటన చేసి కాలం కరిగిపోతున్నా, ఇప్పటివరకు కనీసం అధికారిక ఉత్తర్వులు కూడా వెలువడకపోవడం భక్తులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. వన్యప్రాణుల సంరక్షణ, భక్తుల భద్రత అనే రెండు కీలక అంశాల మధ్య శ్రీశైల ప్రయాణం ప్రస్తుతం ఎంతో సవాలుగా మారింది. దట్టమైన నల్లమల అరణ్యం పులుల సంరక్షణ కేంద్రంగా ఉండటంతో అటవీ జంతువుల స్వేచ్ఛా విహారానికి ఆటంకం కలగకుండా రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఘాట్ రోడ్డులో రవాణాను పూర్తిగా నిషేధించారు. ఈ రాత్రి సమయ ఆంక్షల వల్ల సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వేలాది మంది యాత్రికులు చెక్‌పోస్టుల వద్దే గంటల తరబడి వాహనాల్లో వేచి ఉండాల్సి వస్తోంది. మరోవైపు పగటిపూట కూడా ఇరుకైన మలుపులు, లోతైన లోయలతో కూడిన ఈ ఘాట్ రోడ్డులో ప్రమాదాల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఎందరో భక్తులు దైవదర్శనం కోసం వచ్చి మార్గమధ్యంలోనే ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు నిత్యం కలచివేస్తున్నాయి. ఈ ప్రయాణ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారంగా తెలంగాణలోని బ్రాహ్మణపల్లి నుంచి ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని దోర్నాల వరకు ఏకంగా 86.74 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని 2025 మార్చిలో కేంద్ర ప్రభుత్వం భావించింది. నేషనల్ హైవేస్ అథారిటీ పరిధిలోకి వచ్చే ఈ ప్రతిపాదిత ప్రాజెక్టుకు సంబంధించి ప్రాథమిక నివేదికలు అటవీ శాఖ అనుమతుల కోసం పంపినట్లు సమాచారం. భూమి నుంచి దాదాపు 30 అడుగుల ఎత్తులో స్తంభాలపై ఈ రహదారిని నిర్మించడం ద్వారా కింద అటవీ వన్యప్రాణుల జీవనవిధానానికి ఎటువంటి అంతరాయం కలగదని అధికారులు భావించారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా, అడవి జంతువుల స్వేచ్ఛకు భంగం వాటిల్లకుండా వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా ఈ అధునాతన ఇంజనీరింగ్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. కేంద్రంలో హిందూ సంప్రదాయాలను గౌరవిస్తామని చెప్పే పెద్దలు అధికారంలో ఉన్నప్పటికీ, ఇంతటి చారిత్రక ఆధ్యాత్మిక క్షేత్రానికి సంబంధించిన ప్రాజెక్టు ఫైళ్లు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. గతేడాది మార్చిలోనే ఈ ప్రతిపాదనకు ప్రాథమిక ఆమోదం లభించినట్లు ప్రచారం జరిగినప్పటికీ, ఏడాది దాటినా దీనికి సంబంధించిన జీవోలు గానీ, నిధుల కేటాయింపులు గానీ జరగలేదు. దీంతో అసలు ఈ ప్రాజెక్టు భవిష్యత్తులో పట్టాలెక్కుతుందా లేదా అనేది ఒక పెద్ద మిస్టరీగా మారింది. పాలకులు కేవలం ఎన్నికల వేళల్లో, పండుగ సమయాల్లో ప్రకటనలకే పరిమితమవుతున్నారని, క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించడానికి అవసరమైన జీవోల జారీని పూర్తిగా విస్మరించారనే విమర్శలు భక్తుల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. ఈ బృహత్తర ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు గనుక పూర్తయితే శ్రీశైల మల్లన్న దర్శనం భక్తులకు అత్యంత సులభతరంగా మారుతుంది. హైదరాబాద్ నగరవాసులతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం వంటి నగరాల నుంచి వచ్చే భక్తులు ఘాట్ రోడ్డు భయాలు లేకుండా నేరుగా క్షేత్రానికి చేరుకోవచ్చు. రాత్రి సమయాల్లో ప్రయాణ నిషేధం ఉండదు కాబట్టి, భక్తులు ఒకే రోజులో స్వామివారిని దర్శించుకుని సురక్షితంగా తమ ఇళ్లకు తిరిగి వెళ్లే వీలుంటుంది. కేవలం ఆధ్యాత్మిక ప్రయాణమే కాకుండా, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా వ్యవస్థలో ఈ కారిడార్ ఒక మైలురాయిగా నిలిచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ రవాణా విప్లవం ద్వారా నల్లమల అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న వెనుకబడిన గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాలు ఆర్థికంగా ఎంతో వృద్ధి చెందుతాయి. ఆంధ్రప్రదేశ్ పరిధిలోని రాయలసీమ, కోస్తా జిల్లాలకు నిత్యావసర వస్తువులు, సరుకుల రవాణా ఖర్చులు, సమయం గణనీయంగా తగ్గుతాయి. పర్యాటక రంగం ఊపందుకోవడంతో పాటు స్థానిక గిరిజన, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఇంతటి బహుళ ప్రయోజనకరమైన అంతరాష్ట్ర రహదారి ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక ఖరారు కాకపోవడం వల్ల ఏ ఏ గ్రామాల భూములు సేకరించాల్సి వస్తుందనే స్పష్టత కరువైంది. ప్రతిపాదిత ప్రణాళికల ప్రకారం ఈ ఎలివేటెడ్ కారిడార్ రెండు రాష్ట్రాల సరిహద్దులను కలుపుతూ సాగుతుంది. మొత్తం 86.74 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారి తెలంగాణ పరిధిలో 41.39 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్ పరిధిలో 45.35 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది. తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్ చెక్‌పోస్టు దాటిన తర్వాత బొమ్మనపల్లి సమీపంలో ఈ ఎలివేటెడ్ కారిడార్ పనులు ప్రారంభం కావాల్సి ఉంది. అక్కడి నుంచి దట్టమైన కొండలు, లోయల మీదుగా సాగుతూ దోమలపెంటను తాకుతుంది. ఆ తర్వాత కృష్ణా నది లోయపై నుంచి అద్భుతమైన వంతెన ద్వారా శ్రీశైల మల్లికార్జున స్వామి దేవస్థానం పరిసరాలను దాటుకుని ఏపీలోని పెద్ద దోర్నాల వరకు ఈ కారిడార్‌ను పొడిగిస్తారు. ఈ ప్రాజెక్టు కేవలం కేంద్ర ప్రభుత్వంపైనే కాకుండా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఉమ్మడి కార్యాచరణపైనే ఆధారపడి ఉంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇద్దరూ పరస్పర సమన్వయంతో కేంద్రంపై ఒత్తిడి తెస్తేనే ఈ ఫైల్ ముందుకు కదులుతుంది. ఇరు రాష్ట్రాల అటవీ, రహదారుల శాఖల అధికారులు సంయుక్తంగా సర్వేలు నిర్వహించి, కేంద్ర పర్యావరణ శాఖ నుంచి క్లియరెన్స్ తీసుకురావడానికి ప్రత్యేక చొరవ చూపాల్సి ఉంటుంది. పొరుగు రాష్ట్రాల మధ్య ఉన్న చిన్నచిన్న సరిహద్దు వివాదాలను పక్కన పెట్టి, భక్తుల సౌకర్యార్థం ఇద్దరు ముఖ్యమంత్రులు ఢిల్లీ స్థాయిలో గట్టిగా గళం విప్పినప్పుడే నిధుల విడుదల వేగవంతం అవుతుంది. ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిన అంశం కేవలం కాగితాలకే పరిమితమైంది తప్ప, క్షేత్రస్థాయిలో ఎలాంటి సరిహద్దు గుర్తింపులు లేదా మట్టి పరీక్షలు కూడా ప్రారంభం కాలేదు. సాంకేతిక అనుమతులు, పర్యావరణ అభ్యంతరాలు, నిధుల సమీకరణ వంటి అనేక అడ్డంకులు ఈ ప్రాజెక్టు ముందు ఇంకా పర్వతంలా నిలిచి ఉన్నాయి. బడ్జెట్ కేటాయింపులలో ఈ కారిడార్ ప్రస్తావన లేకపోవడం కూడా పాలకుల చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోంది. దశాబ్దాలుగా నల్లమల ప్రయాణంలో నరకం చూస్తున్న సామాన్య భక్తుల కష్టాలు తీరాలంటే కాలయాపన చేయకుండా తక్షణమే అడుగులు పడాల్సి ఉంది. శ్రీశైల క్షేత్ర మహోన్నత కీర్తికి అనుగుణంగా భక్తుల రక్షణను ప్రథమ కర్తవ్యంగా భావించి పాలకులు కదలాల్సిన సమయం ఆసన్నమైంది. రాజకీయాంశాలు, నిధుల లేమి సాకులతో ప్రాజెక్టును మూలన పడేస్తే భక్తుల ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోతుంది. ప్రతి ఏటా శివరాత్రి, కార్తీక మాసం ఉత్సవాల వేళ ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్‌లతో నరకయాతన అనుభవిస్తున్న లక్షలాది మంది శైవభక్తుల ఆక్రందనలు పాలకులకు వినపడాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అవసరమైన తుది ఆమోద ముద్ర వేసి, పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని కోట్లాది మంది భక్తులు కోరుకుంటున్నారు.



# పొలిమేర్లు కూడా దాటవు కిషన్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి



కేంద్ర మంత్రుల తీరు తమాషాగా ఉందని, రాష్ట్ర అభివృద్ధికి సహకరించకుండా కనీసం పన్నుల వాటా నిధులు కూడా సక్రమంగా విడుదల చేయడం లేదని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. పన్నెండు ఏళ్లుగా అధికారంలో ఉన్నా ధాన్యం కొనుగోలులో కేంద్రం అలసత్వం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ప్రధాన మంత్రి మోదీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తేనే తెలంగాణ పండించిన ప్రతి గింజను కేంద్రంతో కొనిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పాలమూరు ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించడంతో పాటు మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం నిధులు తీసుకువచ్చి అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అధికారం కోసం అడ్డగోలు మాటలు మాట్లాడే వారికి తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పదిహేనో తేదీ తర్వాత ధాన్యం సేకరణ 75 లక్షల మెట్రిక్ టన్నుల మార్కును దాటుతుందని, అప్పుడు కేంద్రం వద్దు, మొక్కజొన్న ఎలా కొనదో చూస్తామని సీఎం సవాల్ విసిరారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల ఏర్పాటులో కేంద్రం చూపిస్తున్న నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు అనుమతుల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించారు. కేంద్రంలో ఉన్న మోదీని చూసి భయపడాల్సిన అవసరం తమకు లేదని, మర్యాదగా ఉంటే గౌరవం దక్కుతుందని లేనిపక్షంలో తమ శైలి ఏంటో చూపిస్తామని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. రాజకీయ ప్రత్యర్థుల మాటలు, అల్ప విమర్శలను తాము నిశితంగా గమనిస్తున్నామని, సమయం వచ్చినప్పుడు సమాధానం చెప్తామని తెలిపారు. రాష్ట్రంలోని రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కోహెడలో 240 ఎకరాల విస్తీర్ణంలో 2,400 కోట్ల రూపాయల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ఒకప్పుడు రంగారెడ్డి జిల్లా కేంద్రంగా కూరగాయలు, ఆకుకూరలు, పాలు సమృద్ధిగా ఉత్పత్తయ్యేవని గుర్తు చేశారు. కానీ ఔటర్ రింగ్ రోడ్డు, విమానాశ్రయం వచ్చిన తర్వాత భూముల ధరలు విపరీతంగా పెరిగి వ్యవసాయం దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కొత్తపేట మార్కెట్ తరలింపు సమయంలో రైతులు పడిన ఇబ్బందులను తానే స్వయంగా పరామర్శించానని, ఆ కష్టాలు మళ్లీ రాకూడదనే ఉద్దేశంతోనే సువిశాలమైన స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో నేడు సుమారు ఒక కోటి 30 లక్షల మంది జనాభా నివసిస్తున్నారని, హైదరాబాద్ మహానగరం అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా జలాలు నగర దాహార్తిని తీరుస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే రైతులు, వ్యాపారులకు అన్ని సౌకర్యాలు అందేలా ఈ మార్కెట్‌ను డిజైన్ చేస్తున్నామని వివరించారు. పెళ్లిళ్లు, పండుగలు ఏవైనా సరే ఇక్కడికి వస్తే అన్ని రకాల పండ్లు, కూరగాయలు ఒకే చోట లభించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని వెల్లడించారు. రైతులకు దెబ్బలు తగిలే పరిస్థితి రాకుండా, లాభసాటిగా ఉండేలా అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఆర్గానిక్ ఫుడ్ పేరుతో ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకునే దుస్థితి నుంచి మన రైతాంగాన్ని బయటపడేయాలని సీఎం పిలుపునిచ్చారు. వరి, పత్తి, జొన్నల సాగుపై విపరీతమైన ఒత్తిడి వల్ల కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, సామాన్యుడి జేబుకు చిల్లు పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వ విధానాల వల్లే ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు పెరిగాయని మండిపడ్డారు. కందుకూరు ప్రాంతంలో పండే టమాటాలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అక్కడ సాస్ తయారీ పరిశ్రమలను తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అభివృద్ధిని అడ్డుకునే శక్తులు ఎన్ని ఉన్నా, తమ లక్ష్యం మాత్రం రైతుల సంక్షేమమేనని చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్ నాయకులు అడుగడుగునా అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. దశాబ్ద కాలంలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన విధ్వంసం ఒక శతాబ్ద కాలానికి సరిపోతుందని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా రాష్ట్ర ప్రగతిని ఎవరూ ఆపలేరని, రియల్ ఎస్టేట్ రంగంలో తెలంగాణ దూసుకుపోతోందని పేర్కొన్నారు. రైతులు సాంప్రదాయ పంటలతో పాటు కూరగాయలు, పండ్లు పండించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. కోహెడ మార్కెట్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూస్తున్న వారి ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని తేల్చిచెప్పారు. ప్రజల కోసం చేస్తున్న మంచి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తాను ఎంపీగా ఉన్న కాలంలోనే రైతు పడుతున్న బాధలను ప్రత్యక్షంగా చూశానని, అందుకే కోహెడలో పండ్ల మార్కెట్ నిర్మాణం అత్యవసరమని గుర్తించానని సీఎం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవడం వల్లనే రైతులకు నష్టం జరుగుతోందని, తాను ఎవరికీ భయపడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. ఫామ్ హౌస్ కేంద్రంగా సాగే కీడును చూసినా, ఢిల్లీలో కూర్చునే పాలకులను చూసినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని గర్జించారు. ధాన్యం కొనుగోలు నుంచి మెట్రో విస్తరణ వరకు కేంద్రం చూపిస్తున్న వివక్షను ఎండగట్టడంలో తాను వెనకాడనని చెప్పారు. రైతుల పక్షాన నిలబడటమే తన ప్రాథమిక బాధ్యత అని పునరుద్ఘాటించారు. రంగారెడ్డి జిల్లాలో కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సముదాయానికి శంకుస్థాపన చేయడం ద్వారా ఒక గొప్ప ప్రయాణం మొదలైందని సీఎం వెల్లడించారు. 2,400 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా లక్షలాది మందికి లబ్ధి చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల శంకుస్థాపనలు పండుగ వాతావరణంలో జరగాలని, ప్రజల ఆశీస్సులు ఉంటేనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. రాబోయే కాలంలో తెలంగాణ వ్యవసాయ రంగం దేశానికే దిక్సూచిలా మారుతుందని, ఆ దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. రైతుల కన్నీళ్లు తుడిచేందుకే ప్రాధాన్యత ఇస్తామని, ఇది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని నిరూపించుకుంటామని ప్రకటించారు. మొత్తానికి రంగారెడ్డి జిల్లాలో రేవంత్ రెడ్డి పర్యటన రాజకీయంగా కొత్త ఊపును ఇచ్చింది. కేంద్రంపై ఒత్తిడి పెంచడం ద్వారా నిధుల సాధనలో వెనకడుగు వేయబోమని సంకేతాలు పంపారు. అభివృద్ధిని అడ్డుకుంటున్న వారిని ప్రజల ముందు దోషులుగా నిలబెట్టేందుకు ఈ వేదికను వాడుకున్నారు. 240 ఎకరాల విస్తీర్ణంలో రాబోతున్న పండ్ల మార్కెట్ తెలంగాణ వ్యాపార రంగానికి కేంద్రబిందువుగా మారుతుందని ఆకాంక్షించారు. ప్రజా క్షేత్రంలో ఎదురులేని నాయకుడిగా ఎదిగేందుకు రేవంత్ రెడ్డి వేస్తున్న ప్రతి అడుగు తెలంగాణ రాజకీయాల్లో కీలక మార్పులకు నాంది పలుకుతోంది. రైతుల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి అనే రెండు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగుతున్న ప్రభుత్వం, కేంద్రంతో పోరాడి అయినా లక్ష్యాలను చేరుకుంటామని స్పష్టం చేస్తోంది.

# కాలనాగులతో జాగ్రత్త

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాలం అనుకూలించని వేళలో వానపాములు సైతం నాగుపాములై బుసలు కొట్టడం సహజమని, అటువంటి విషతుల్యమైన శక్తుల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు సూచించారు. మలేషియా తెలంగాణ అసోసియేషన్, బీఆర్ఎస్ మలేషియా శాఖల సమన్వయంతో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఖండాలు దాటినా మాతృభూమిపై మమకారాన్ని వదలకుండా, ఏడు సముద్రాల అవతల సైతం తెలంగాణ తల్లి వైభవాన్ని ప్రపంచానికి చాటిచెబుతున్న ప్రవాసీయుల స్ఫూర్తి అభినందనీయమని ఆయన కొనియాడారు. వెయ్యేళ్ళకు పైగా నిగూఢమైన చరిత్ర, సంస్కృతిని అక్కున చేర్చుకున్న ఈ గడ్డ మీద నివసించే ప్రతి బిడ్డ సగర్వంగా తన అస్తిత్వాన్ని చాటుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ జాతి పుట్టుక నుంచే నిరంతర పోరాటాల గడ్డగా గుర్తింపు పొందిందని, ప్రతి తరం ఏదో ఒక సమరాన్ని నడిపిందని ఆయన గుర్తు చేశారు. భక్త రామదాసు నుంచి గోరటి వెంకన్న వరకు ధిక్కార స్వరాన్ని వినిపించిన ప్రజా కళాకారుల గళం ఈ నేల ప్రత్యేకత అని ఆయన అభివర్ణించారు. ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగను జరుపుకునే ఏకైక జాతి మనదేనని, ఈ అద్భుతమైన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన నొక్కి చెప్పారు. దశాబ్దాల తొలి ఉద్యమం, ఆ తర్వాత కేసీఆర్ నాయకత్వంలో పుష్కర కాలం పాటు జరిగిన మలిదశ ఉద్యమం వెనుక ఎన్నో త్యాగాలు ఉన్నాయని ఆయన వివరించారు. స్వరాష్ట్ర సాధన కోసం జరిగిన ప్రజాస్వామిక ఉద్యమం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైనదని ఆయన పేర్కొన్నారు. ప్రపంచస్థాయిలో కొరియా, తైవాన్, సింగపూర్, మలేషియా, వియత్నాం వంటి దేశాలను ఏషియన్ టైగర్స్ అని పిలుస్తారని, చిన్న దేశాలుగా మొదలై అసాధారణ విజయాలను ఆ దేశాలు నమోదు చేశాయని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా భారతదేశంలో చిన్న రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణ, అత్యల్ప కాలంలోనే అత్యున్నత శిఖరాలను తాకిందని ఆయన వివరించారు. ఒకప్పుడు వలసల తెలంగాణగా, కరువు కోరల్లో చిక్కుకున్న ప్రాంతంగా ముద్రపడిన ఈ గడ్డను, దేశానికి అన్నపూర్ణగా మార్చిన ఘనత కేసీఆర్ గారిదని ఆయన పునరుద్ఘాటించారు. వ్యవసాయం, పరిశ్రమలు, ఐటీ రంగాల్లో తెలంగాణను దేశానికే దిక్సూచిగా నిలపడంలో ఆయన కృషి వెలకట్టలేనిదని ఆయన పేర్కొన్నారు. అత్యంత వెనుకబడిన ప్రాంతంగా పేరున్న తెలంగాణను, ఆర్థిక అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టిన ఘనత గత పదేళ్ల పాలనకే దక్కుతుందని గణాంకాలు చెబుతున్నాయి. తలసరి ఆదాయంలో వంద శాతం వృద్ధి, స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (GSDP)లో అగ్రస్థానానికి చేరడం వెనుక పటిష్టమైన ప్రణాళికలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.



గతంలో గేలి చేయబడిన తెలంగాణ సంస్కృతిని, నేడు ప్రపంచ వేదికలపై సగర్వంగా నిలబెట్టామన్నారు. ఇంతటి ప్రగతిని కళ్లారా చూసినా, అర్థం చేసుకోలేని అజ్ఞానులు కొందరు తెలంగాణ అభివృద్ధిపై అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. నాలుగు అడుగుల ఎత్తు ఉన్న నాయకులు తెలంగాణ నీళ్లు, నిధుల గురించి చేస్తున్న అసత్య ఆరోపణలను తిప్పికొట్టాలని ఆయన కోరారు. కాలం మనది కాని సమయంలో వానపాములు సైతం నాగుపాములై బుసలు కొట్టడం మొదలుపెట్టాయని, ఇటువంటి విషతుల్యమైన వాదనలను ప్రజలు నమ్మవద్దని ఆయన హెచ్చరించారు. కంచె లేని చేనులో విచ్చలవిడిగా మేసే మేకల్లా, అవగాహన లేని కొందరు విష ప్రచారం చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. పుష్కర కాలంలో చేసిన అభివృద్ధిని, దశాబ్దాల కాలంలో ఇతర రాష్ట్రాలు సాధించలేకపోయాయని ఆయన గుర్తు చేశారు. ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్న పార్టీగా, భవిష్యత్తులో కూడా ఇదే ప్రజాబలంతో తెలంగాణను కాపాడుకుంటామని ఆయన స్పష్టం చేశారు. 2028లో రాబోయేది కేసీఆర్ గారేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఒకప్పుడు కరెంటు లేక, సాగునీరు అందక అల్లాడిన రైతులకు, నేడు పచ్చని పంటలతో పలకరిస్తున్న చేల రూపంలో కేసీఆర్ కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఆయన అన్నారు. పదేళ్లలో రాష్ట్రం సాధించిన లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు, లక్షల మందికి దక్కిన ఉపాధి అవకాశాలు ఈ ప్రగతికి నిదర్శనమని ఆయన తెలిపారు. మలేషియా వంటి సుదూర దేశాల్లో కూడా తెలంగాణ వెలుగులు కనిపిస్తున్నాయంటే, అది గడిచిన పదేళ్లలో వచ్చిన మార్పేనని ఆయన చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఉన్నా, తెలంగాణ బిడ్డగా గర్వంగా ఉండాలని, రాష్ట్ర పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఆత్మగౌరవం కోసం పుట్టిన తెలంగాణ, ఎవరికీ తలవంచని రీతిలో ముందుకు సాగుతుందన్నారు. ప్రకృతిని ఆరాధించే, చెట్లను, పూలను పూజించే ఒకే ఒక్క సంస్కృతి మన తెలంగాణదని, దీనిని ప్రపంచం మొత్తం ఆదర్శంగా తీసుకుంటున్నదని ఆయన తెలిపారు. కళాకారుల గడ్డ, కవుల పుట్టినిల్లు అయిన తెలంగాణ, ఇకముందు కూడా అదే పంథాలో ముందుకు వెళ్తుందని ఆయన స్పష్టం చేశారు. మలిదశ ఉద్యమంలో కేసీఆర్ గారిని నమ్మి, దశాబ్ద కాలం పాటు ఆయన వెంట నడిచిన ప్రజలందరికీ ఈ విజయంలో భాగస్వామ్యం ఉందన్నారు. అనేక సవాళ్లు, అడ్డంకులు, పదవీ త్యాగాలను దాటుకుని మనం సాధించుకున్న ఈ రాష్ట్రాన్ని ఎవరూ ఏం చేయలేరని ఆయన పేర్కొన్నారు. దశాబ్ద కాలపు అభివృద్ధిని కేవలం కొన్ని మాటలతో తుడిచిపెట్టాలని చూసే శక్తులను ప్రజలు ఎండగట్టాలన్నారు. ఎన్నారైలు కేవలం సంపాదన కోసమే కాకుండా, మన సంస్కృతిని ప్రపంచానికి చాటే రాయబారులుగా వ్యవహరించాలని ఆయన సూచించారు. మలేషియాలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఇంత ఘనంగా జరుపుకోవడం, మన మూలాలను మర్చిపోలేదని చెప్పడానికి నిదర్శనమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడకముందు పడ్డ ఇబ్బందులు, ఆ తర్వాత మారిన జీవన ప్రమాణాలు, పెరిగిన ఆదాయంపై ప్రతి ఒక్కరూ చర్చిస్తారని ఆయన ఆకాంక్షించారు. 2028లో తిరిగి అధికారాన్ని చేపట్టి, మధ్యలో ఆగిపోయిన అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. విషపూరితమైన మాటలను విస్మరించి, నిజమైన ప్రగతిని నమ్ముతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక మాట్లాడుతున్న వారి నోళ్లకు, ప్రజలు త్వరలోనే సమాధానం చెబుతారని ఆయన తెలిపారు. తెలంగాణ తల్లికి సేవ చేసే అవకాశం మళ్లీ మాకే దక్కుతుందని ఆయన ధీమాగా చెప్పారు. ఒక చిన్న రాష్ట్రం ఎలా ఆర్థికంగా నిలదొక్కుకుంటుందో, దేశానికే ఎలా దిశానిర్దేశం చేస్తుందో చూపించామని ఆయన గర్వంగా వెల్లడించారు. ప్రాజెక్టుల నిర్మాణం, విద్యుత్ రంగా ప్రక్షాళన, వ్యవసాయంలో వచ్చిన మార్పులు, పరిశ్రమల స్థాపన ఇవన్నీ కేవలం పదేళ్ల కాలంలోనే జరిగాయని ఆయన వివరించారు. ఒకప్పుడు వలస వెళ్లిన వారు, నేడు తిరుగు ప్రయాణంలో రాష్ట్రానికి వస్తున్నారని ఆయన తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశంలోనే అతి తక్కువ అప్పులున్న రాష్ట్రంగా ఎదిగిందని గణాంకాలు రుజువు చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. తలసరి ఆదాయంలో దేశ సగటు కంటే అధికంగా ఉండటం మన గొప్పతనమని ఆయన అన్నారు. ఇన్ని విజయాలు సాధించిన రాష్ట్రం గురించి అజ్ఞానంతో మాట్లాడుతున్న వారికి, త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతారని ఆయన జోస్యం చెప్పారు. 2028లో బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందన్న నమ్మకంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సబ్బండ వర్గాల అభివృద్ధి కోసం, కేసీఆర్ గారు వేసిన పునాదులపై భవిష్యత్ నిర్మాణాన్ని చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

# రేవంత్ రెడ్డిని మళ్లీ ఓడగొడుతాం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి కొడంగల్ నియోజకవర్గం వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన సొంత నియోజకవర్గంలోనే ఓడించి తీరుతామని భారత్ రాష్ట్ర సమితి శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు సంచలన సవాల్ విసిరారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రాజకీయ ముఖచిత్రంలో రాబోయే రోజుల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి శనివారం పాలమూరు జిల్లా పర్యటనలో చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ఎన్ని జిమ్మిక్కులు చేసినా, ఎంతగా డైలాగులు కొట్టినా ఉమ్మడి జిల్లా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. పాలమూరు గడ్డపై ఉన్న 14 అసెంబ్లీ స్థానాలకు గాను 14 స్థానాల్లోనూ రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని జోస్యం చెప్పారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా విభిన్నమైన రాజకీయ ఒరవడి నడుస్తోందని మాజీ మంత్రి విశ్లేషించారు. ఢిల్లీ వేదికగా అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వానికి, పశ్చిమ బెంగాల్ పరిధిలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి, తమిళనాడులో స్టాలిన్ నేతృత్వానికి ప్రజలు ఏ విధంగా షాక్ ఇచ్చారో ఉదహరించారు. అదే తరహా రాజకీయ మార్పునకు తెలంగాణ వేదిక కాబోతోందని అంచనా వేశారు. రాబోయే ఎన్నికల రణరంగంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. ముఖ్యమంత్రి వైఖరిని ఎండగడుతూ తీవ్రమైన పదజాలంతో విమర్శలు గుప్పించారు. అబద్ధాలకు ఒక అంగి, లాగు తొడిగితే అది ఖచ్చితంగా రేవంత్ రెడ్డి రూపమే అవుతుందని ఎద్దేవా చేశారు. పాలమూరు సభలో ముఖ్యమంత్రి మాట్లాడిన తీరు ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తిలా లేదని హరీశ్‌రావు ఆక్షేపించారు. వీధి రౌడీలను తలపించేలా బజారు భాషను ఉపయోగించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. బీఆర్ఎస్ పార్టీ జెండా గద్దెలను కూల్చేస్తామంటూ ముఖ్యమంత్రి ప్రగల్భాలు పలుకుతున్నారని మండిపడ్డారు. గతంలో కొడంగల్ నియోజకవర్గంలో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చిల్లర మాటలు చెప్పిన రేవంత్ రెడ్డిని తామే దగ్గరుండి చిత్తుగా ఓడించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆనాడు ఇచ్చిన మాటకు కట్టుబడి రాజకీయ సన్యాసం తీసుకోకుండా, తెల్లారేసరికి మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానంలో పోటీకి దిగిన చరిత్ర రేవంత్ రెడ్డిదని విమర్శించారు. మాట తప్పడం, మడమ తిప్పడం కాంగ్రెస్ నాయకుడికి అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ముప్పై నెలల కాలంలో పాలమూరు జిల్లాకు చేకూర్చిన లబ్ధి శూన్యమని మాజీ మంత్రి విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో పాదయాత్ర చేపట్టి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని నిర్ణయించడంతోనే ముఖ్యమంత్రిలో వణుకు మొదలైందని పేర్కొన్నారు. ఇంతకాలం కుంభకర్ణుడిలా నిద్రపోయిన రేవంత్ రెడ్డి, ప్రతిపక్షాల కదలికలతోనే హడావుడిగా మేల్కొని జిల్లాల పర్యటనలు ప్రారంభించారని ఆరోపించారు. సీఎం ప్రసంగాల్లో ప్రజా సంక్షేమ ఆలోచనల కంటే ఫ్రస్టేషన్ ఎక్కువగా కనిపిస్తోందని విశ్లేషించారు. ప్రభుత్వ ధనంతో బహిరంగ సభలు ఏర్పాటు చేసి, ప్రజలకు ఉపయోగపడే విషయాలు చెప్పకుండా పాత చిల్లర మాటలనే పదే పదే వల్లెవేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు ఉమ్మడి జిల్లా పరిధిలో పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన రికార్డు తమదని హరీశ్‌రావు గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కొత్తగా ఒక్క ఎకరానికైనా సాగునీరు అందించిన దాఖలాలు ఉన్నాయా అని నిలదీశారు. గతంలో తమ ప్రభుత్వం పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 32వేల కోట్ల రూపాయలు మంజూరు చేసిందని వివరించారు. అందులో 27వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసి ప్రాజెక్టును దాదాపు పూర్తి దశకు తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్యాకేజీ3 పరిధిలో ఒక చిన్న కాలువ లోపల ఉన్న బండరాళ్లను తొలగిస్తే నాలుగు ప్రధాన రిజర్వాయర్లను నింపే అవకాశం లభించేదని స్పష్టం చేశారు. నెల రోజుల్లో పూర్తయ్యే ఆ చిన్న పనిని కూడా ఈ ముప్పై నెలల్లో చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సాగునీటి రంగానికి సంబంధించిన ప్రాథమిక అవగాహన కూడా లేదని హరీశ్‌రావు విమర్శించారు. కృష్ణా నదీ జలాల వినియోగం విషయంలో రాష్ట్ర హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టు పెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత మే నెలలో తెలంగాణ ఇంజనీర్ ఇన్ చీఫ్ కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు రాసిన అధికారిక లేఖలోని అంశాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆ లేఖ ప్రకారం కృష్ణా నదిలో అందుబాటులో ఉన్న నీటిలో ఆంధ్రప్రదేశ్ 75 శాతం మేర వాడుకుంటే, తెలంగాణ కేవలం 25 శాతం మాత్రమే ఉపయోగించుకోగలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే రేవంత్ రెడ్డి, తన సొంత జిల్లా పరిధిలో సాగునీటి హక్కులను కాపాడటంలో ఘోరంగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ముఖ్యమంత్రికి చేతనైతే అసెంబ్లీ వేదికగా చర్చకు రావాలని హరీశ్‌రావు సవాల్ విసిరారు. ప్రాజెక్టుల నిర్వహణ, నిధుల ఖర్చుపై తాము ఎప్పుడైనా చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ స్థాయి రేవంత్ రెడ్డిది కాదని, ఆయనతో మాట్లాడే అర్హత ముఖ్యమంత్రికి లేదని తేల్చిచెప్పారు. సీఎం అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి తామే సరిపోతామని, అసెంబ్లీలో చర్చ పెడితే పారిపోకుండా కూర్చోవాలని హితవు పలికారు. సభ వేదికగా నిజానిజాలు ఏంటో ప్రజల ముందుకు ఉంచుతామని భరోసా వ్యక్తం చేశారు. రైతాంగానికి, రాష్ట్ర ప్రయోజనాలకు ద్రోహం చేస్తున్న కాంగ్రెస్ అసలు రంగును బయటపెడతామని హెచ్చరించారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ పార్టీ సమర శంఖం పూరించబోతోందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. పాలమూరు ఎత్తిపోతల పథకం పనులను గాలికొదిలేసి, ప్రతిపక్షాలపై కక్షసాధింపు రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి ఇబ్బందులను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని విమర్శించారు. కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసమే రేవంత్ రెడ్డి ఇటువంటి సభలు పెడుతున్నారని దుయ్యబట్టారు. రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలోనే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామని స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టుల కింద గతంలో కేవలం 27 వేల ఎకరాలకు మాత్రమే నీరు అందేదని మాజీ మంత్రి గుర్తుచేశారు. తమ ప్రభుత్వ హయాంలో భూసేకరణ పూర్తి చేసి, పనులను వేగవంతం చేయడం ద్వారా ఆ ఆయకట్టును ఏకంగా 6.5 లక్షల ఎకరాలకు పెంచిన ఘనత బీఆర్ఎస్‌దేనని వివరించారు. కాంగ్రెస్ నేతలు నాడు ప్రాజెక్టులపై కోర్టుల్లో కేసులు వేసి అడ్డుపడినా, వాటన్నింటినీ అధిగమించి పనులు చేశామన్నారు. ఈ ముప్పై నెలల్లో కొత్తగా ఒక్క గజం భూమి కూడా సేకరించలేని ఈ ప్రభుత్వం, ఇప్పుడు భూసేకరణ ప్రతిపాదనల గురించి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు.



# నైపుణ్యానికి దక్కిన జాతీయ గుర్తింపు

**విశాలభారతి:** న్యూఢిల్లీలో జూన్ 5న జరిగిన జాతీయ స్థాయి మౌలిక వసతుల అవార్డుల ప్రదానోత్సవంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ సంస్థకు "నిర్మాణ రంగంలో ఉత్తమ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం" విభాగంలో ప్రతిష్ఠాత్మక ప్లాటినం పురస్కారం లభించింది. అదేవిధంగా ప్రభుత్వ సేవలో రహదారులు, భవనాల విభాగంలో అత్యుత్తమ ప్రదర్శనకు గాను ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ ఎం. శ్రీనివాస రెడ్డికి గోల్డ్ పురస్కారం దక్కింది. ఈ రెండు జాతీయ స్థాయి విజయాల నేపథ్యంలో రహదారులు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని ఆ సంస్థ బృందం మర్యాదపూర్వకంగా కలిసి ఈ ఆనందాన్ని పంచుకుంది. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందిస్తూ.. తెలంగాణలోని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి కల్పించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని, ముఖ్యంగా 202526 సంవత్సరంలో 21,016 మందికి వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విజయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా రాష్ట్ర యువతకు మరింత మెరుగైన శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఈ సంస్థ ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.



# సెమీకండక్టర్ హబ్‌గా తెలంగాణ



**మొదటిపేజీ తరువాయి**

చేసుకోవడంపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా 'తెలంగాణ మలేషియా ' మధ్య సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాల్లో పరస్పర సహకారానికి గల అవకాశాలను ఇరుపక్షాలు ఒకరికొకరు వివరించుకున్నారు. ఆధునిక యుగంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న కృత్రిమ మేధస్సు , ఇన్నోవేషన్స్, హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ తదితర రంగాల్లో ఉమ్మడిగా ముందడుగు వేయడంపై ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకోవాలని నిర్ణయించారు. చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్ తయారీ, అధునాతన సాంకేతిక రంగాల్లో హైదరాబాద్ నగరం ఇప్పటికే అంతర్జాతీయ కేంద్రంగా శరవేగంగా ఎదుగుతోందని మంత్రి శ్రీధర్ బాబు ఈ సమావేశంలో గర్వంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో నెలకొన్న సానుకూల వాతావరణం, ప్రభుత్వ విధానాలు అంతర్జాతీయ సంస్థలను విశేషంగా ఆకర్షిస్తున్నాయని చెప్పారు. సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాలతో పాటు అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఎమర్జింగ్ టెక్నాలజీస్ లో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ప్రతినిధుల బృందానికి వివరించారు. లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, క్లీన్ ఎనర్జీ, ఏరో స్పేస్, డిఫెన్స్, ప్రెసిషన్ ఇంజినీరింగ్ వంటి విభిన్న రంగాల్లో సైతం తెలంగాణ హబ్‌గా మారుతోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి పెట్టుబడిదారులకు 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్'గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అడుగులు వేస్తోంది. పారిశ్రామిక వేత్తలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, సింగిల్ విండో అనుమతుల ప్రక్రియను మరింత వేగవంతం చేసినట్లు మంత్రి తెలిపారు. తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శవంతమైన రోల్ మోడల్ గా నిలబెట్టడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ ఆశయ సాధనలో భాగంగానే అంతర్జాతీయ భాగస్వామ్యాలకు, విదేశీ పెట్టుబడుల ఆకర్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యమిస్తోందని మలేషియా ప్రతినిధులకు వివరించారు. సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజింగ్ రంగాల్లో పెనాంగ్ ప్రాంతానికి అంతర్జాతీయంగా దశాబ్దాల కాలం నాటి సుదీర్ఘ అనుభవం, నిపుణత ఉన్నాయి. ఈ నైపుణ్యాన్ని ఉపయోగించుకుంటూ గ్లోబల్ సెమీకండక్టర్ హబ్‌గా తెలంగాణ ఎదిగేందుకు ఈ భాగస్వామ్యం ఎంతగానో దోహదపడుతుందని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు ప్రాంతాల నైపుణ్యాలు తోడైతే అంతర్జాతీయ చిప్ కొరతను అధిగమించేలా అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. తెలంగాణలో లభించే ప్రతిభావంతులైన యువశక్తి, పెనాంగ్‌లోని సాంకేతిక పరిజ్ఞానం కలిసి పారిశ్రామిక ప్రగతికి కొత్త బాటలు వేస్తాయని ఆకాంక్షించారు. మంత్రి శ్రీధర్ బాబు వివరించిన పారిశ్రామిక విధానాలు, మౌలిక వసతుల లభ్యతపై మలేషియా పెనాంగ్ డిప్యూటీ సీఎం వైబీ జగదీప్ సింగ్ దియో ప్రశంసల జల్లు కురిపించారు. సాంకేతిక రంగంలో తెలంగాణ సాధిస్తున్న పురోగతి ముదావహమని కొనియాడారు. తెలంగాణ లాంటి అత్యంత ప్రగతిశీల రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు తాము ఎంతో ఆసక్తిగా ఉన్నామని ప్రకటించారు. ఇరు ప్రాంతాల పారిశ్రామిక ప్రయోజనాలను బలోపేతం చేసేలా, త్వరితగతిన ఫలితాలు సాధించేలా ఒక సమగ్ర ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకు సాగుతామని ప్రతినిధుల బృందం స్పష్టం చేసింది. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలలో ఉన్న భారీ పారిశ్రామిక పార్కులు విదేశీ కంపెనీల ఏర్పాటుకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. ఇక్కడ అందుబాటులో ఉన్న అంతరాయం లేని విద్యుత్ సరఫరా, నిరంతర నీటి వసతి, అద్భుతమైన రవాణా రంగాలు గ్లోబల్ హబ్‌గా ఎదగడానికి దోహదం చేస్తున్నాయి. వీటన్నింటినీ మలేషియా బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. రాబోయే రోజుల్లో మలేషియాకు చెందిన దిగ్గజ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలు హైదరాబాద్ నగరంలో తమ అనుబంధ విభాగాలను స్థాపించేందుకు ఆసక్తి చూపుతున్నాయి. రాష్ట్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఇండస్ట్రియల్ క్లస్టర్ల వివరాలను కూడా ఐటీ శాఖ మంత్రి ఈ సమావేశంలో ప్రత్యేకంగా ప్రదర్శించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కాలుష్య రహిత పారిశ్రామిక జోన్ల ఏర్పాటుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. ఎకో ఫ్రెండ్లీ విధానాలను అవలంబిస్తూనే పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించడం తెలంగాణ ప్రత్యేకతగా నిలుస్తోందని చెప్పారు. ఈ ప్రణాళికలు విదేశీ ప్రతినిధులను ఎంతగానో ఆకట్టుకున్నాయి, ఇక్కడి పర్యావరణ అనుకూల వాతావరణంలో భాగస్వామ్యం కావడం తమకు ఆనందాన్ని ఇస్తుందని వారు పేర్కొన్నారు. మానవ వనరుల అభివృద్ధి రంగంలో సైతం ఇరు ప్రాంతాల మధ్య కీలక ఒప్పందాలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. తెలంగాణలోని నైపుణ్యం కలిగిన యువతకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు, పెనాంగ్ లోని సాంకేతిక విద్యాసంస్థలతో అనుసంధానం చేయడానికి అంగీకారం కుదిరింది. దీనివల్ల స్థానిక యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయి. పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను ఇక్కడే తయారు చేయడం ద్వారా కంపెనీల నిర్వహణ వ్యయం చాలా వరకు తగ్గుతుందని భావిస్తున్నారు. ఈ అత్యున్నత స్థాయి భేటీ తెలంగాణ పారిశ్రామిక రంగానికి ఒక కొత్త ఉత్తేజాన్ని ఇచ్చింది. మలేషియా ప్రతినిధుల పర్యటన విజయవంతం కావడం ద్వారా రాబోయే రోజుల్లో రాష్ట్రంలోకి భారీగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చే మార్గం సుగమమైంది. చిప్ డిజైనింగ్, మ్యానుఫ్యాక్చరింగ్ రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు హైదరాబాద్ వేదిక కాబోతోందనే నమ్మకం పారిశ్రామిక వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వం చూపిస్తున్న చొరవ, అందిస్తున్న ప్రోత్సాహకాలతో తెలంగాణ త్వరలోనే గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా అవతరించడం ఖాయంగా కనిపిస్తోంది.

# నల్లగొండ ధాన్యం కొనుగోళ్ల గందరగోళం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

యాసంగి సాగు కాలం ముగిసి, నైరుతి రుతుపవనాల రాకతో వానాకాలం సీజన్ ముంగిట్లోకి వచ్చేసినా నల్లగొండ జిల్లాలో అన్నదాతల కష్టాలు తీరడం లేదు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత జిల్లాలోనే ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ అస్తవ్యస్తంగా తయారైందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు కీలక మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్షేత్రస్థాయిలో వరుస సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 459 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికీ 87 కేంద్రాలు ధాన్యపు రాశులతో నిండిపోయి ఉన్నాయి. కొనుగోళ్లు పూర్తయిన చోట కూడా రవాణా సక్రమంగా సాగక రైతులు వారాల తరబడి కేంద్రాల వద్దే పడిగాపులు కాయాల్సి వస్తోంది. జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో 6.20 లక్షల ఎకరాల్లో వరి సాగవగా, సుమారు 9 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు ముందస్తు అంచనా వేశారు. ఈ భారీ దిగుబడిని సేకరించేందుకు ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను తెరిచారు. సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేయడానికి దాదాపు రెండు కోట్ల గన్నీ సంచులు అవసరమవుతాయని అధికారులు లెక్కలు తేల్చారు. కాగితాల వరకూ ప్రణాళికలు పక్కాగా కనిపిస్తున్నా, ఆచరణలోకి వచ్చేసరికి జిల్లా యంత్రాంగం పూర్తిగా చేతులెత్తేసింది. వానాకాలం విత్తనాలు వేసే సమయం ఆసన్నమవుతున్నా చేతికొచ్చిన పంట అమ్ముడుపోక రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోంది. సీజన్ ప్రారంభానికి ముందే కలెక్టర్ చంద్రశేఖర్ పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి ముందస్తు వ్యూహాన్ని ఖరారు చేయాల్సి ఉండింది. ఏ మండలంలో ఎంత విస్తీర్ణంలో పంట సాగైంది, ఆయా ప్రాంతాల్లో ఎన్ని లారీలు అందుబాటులో ఉంచాలి, గన్నీ సంచుల నిల్వలను ఎలా పంపిణీ చేయాలనే కనీస అవగాహన లోపించింది. కలెక్టర్ అడపాదడపా కొన్ని ఐకేపీ కేంద్రాలను సందర్శించి చేతులు దులుపుకున్నారే తప్ప, క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించడానికి చొరవ చూపలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల స్థాయిల్లో కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షించాల్సిన తహసీల్దార్లు సైతం కార్యాలయాలకే పరిమితమవడంతో రైతుల గోడు పట్టించుకునేవారే కరువయ్యారు. నల్లగొండ జిల్లాలో కొనుగోలు ప్రక్రియ ఇంతలా మందగించడానికి పౌరసరఫరాల శాఖ తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలే ప్రధాన కారణమని తెలుస్తోంది. గతంలో కస్టమ్ మిల్లింగ్ రైస్ బియ్యం పక్కదారి పట్టాయనే ఆరోపణలతో కొంతమంది రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, అరెస్టులు చేయడం జిల్లాలో కలకలం రేపింది. జిల్లాలోని రైస్ మిల్లింగ్ పరిశ్రమలో అత్యధిక శాతం ఒకే సామాజిక వర్గానికి చెందిన వ్యాపారస్తులు ఉండటంతో ఈ చర్యలు వారిలో తీవ్ర అసంతృప్తిని రేకెత్తించాయి. అధికార యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరిస్తోందంటూ మిల్లర్లు హఠాత్తుగా ప్రభుత్వానికి సహాయ నిరాకరణ ప్రకటించారు. మిల్లర్ల మొండివైఖరి కారణంగా ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు ధాన్యం రవాణా నిలిచిపోయింది. దీంతో కొనుగోలు కేంద్రాలన్నీ ధాన్యపు బస్తాలతో అడుగు పెట్టేందుకు వీల్లేకుండా మునిగిపోయాయి. ఈ సంక్షోభం తలెత్తిన వెంటనే కలెక్టర్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై, వారికి భరోసా కల్పించి ఉంటే పరిస్థితి ఇంత దూరం వచ్చేది కాదు. పరిపాలనాధికారి సరైన సమయంలో స్పందించకపోవడంతో ఐటీఏ, పౌరసరఫరాల విభాగాల మధ్య సమన్వయం దెబ్బతిని, చివరకు అన్నదాతలు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయాల్సిన దుస్థితి దాపురించింది. కేంద్రాల వద్ద నెల రోజులకు పైగా నిరీక్షిస్తే తప్ప కాంటాలు కాని పరిస్థితి నెలకొంది. ఈ లోగా ఆకాశం మేఘావృతమై కురుస్తున్న అకాల వర్షాలకు రైతులు తెచ్చిన ధాన్యం తడిసి ముద్దవుతోంది. తడిసిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వబోమని అధికారులు నిర్మొహమాటంగా చెబుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. తూకం వేసిన ధాన్యాన్ని సైతం మిల్లులకు తరలించకపోవడంతో బస్తాల్లోనే మొలకలు వస్తున్నాయి. కంటికి రెప్పలా కాపాడుకున్న పంట కళ్లముందే పాడవుతుంటే రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో స్థానిక ప్రజాప్రతినిధులు సైతం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది. మంత్రులు హెలికాప్టర్లలో వచ్చి వెళ్తున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో గన్నీ సంచుల కొరత, లారీల కొరతను తీర్చడం లేదని రైతులు మండిపడుతున్నారు. దళారులు, కొందరు అధికారులు చేతులు కలిపి తేమ శాతం సాకుతో క్వింటాలుకు ఐదు నుండి పది కిలోల వరకు తరుగు తీస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారు. అడిగితే కొనుగోలు నిలిపివేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో వ్యవసాయమే ప్రధాన జీవనాధారం కావడంతో యాసంగి డబ్బులు చేతికి వస్తేనే వానాకాలం సాగుకు పెట్టుబడులు సమకూరుతాయి. కొనుగోళ్లు ఆలస్యమవడమే కాకుండా, అమ్మిన ధాన్యానికి సంబంధించిన నగదు జమ (బ్యాంక్ అకౌంట్లలో డబ్బులు పడటం) వారాల తరబడి కావడం లేదు. బ్యాంకుల చుట్టూ తిరిగినా సర్కారు నుంచి నిధులు రాలేదనే సమాధానం వస్తోంది. దీంతో కొత్త సీజన్ కు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడానికి రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్పందించి మిల్లర్లతో ఉన్న వివాదాలను తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కలెక్టర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మిగిలిపోయిన 87 కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే సేకరించాలి. రవాణా కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి అదనపు లారీలను రంగంలోకి దించాలి. వర్షాల ముప్పు పొంచి ఉన్నందున తడిసిన ధాన్యాన్ని కూడా ఎటువంటి షరతులు లేకుండా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలి.



# మంత్రి పదవి దక్కేనా?

**మొదటిపేజీ తరువాయి**

ఈ కలయికకు రాజకీయంగా ఎనలేని ప్రాధాన్యత ఏర్పడింది. రాష్ట్రావిర్భావం తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ ఉమ్మడి నల్గొండ జిల్లా నుండి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మాత్రమే కేబినెట్‌లో అవకాశం దక్కడంతో, ఈసారి ఎలాగైనా స్థానం సంపాదించాలనే పట్టుదలతో రాజగోపాల్ రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలోని రాహుల్ గాంధీ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ పనితీరు, తాజా రాజకీయ పరిణామాలు విస్తృతంగా చర్చకు వచ్చాయి. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిన తర్వాత ప్రజల్లోకి వెళ్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును రాజగోపాల్ రెడ్డి అధిష్ఠానానికి వివరించినట్లు సమాచారం. అదే సమయంలో సుమారు ముప్పై నిమిషాల పాటు సాగిన ఈ భేటీలో కేబినెట్ విస్తరణ అంశమే ప్రధాన అజెండాగా సాగిందని గాంధీ భవన్ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ గెలుపు కోసం తాను చేసిన కృషిని, మునుగోడు ఉపఎన్నిక నాటి నుండి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను మోసిన విధానాన్ని ఆయన అగ్రనేత ముందుంచారు. ఉమ్మడి జిల్లా రాజకీయ సమీకరణాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సామాజిక సమతుల్యతను కాపాడటంలో తనలాంటి సీనియర్ల అవసరాన్ని ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి ప్రస్తావించినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఎన్నికల ప్రచార పర్వంలో తనకు లభించిన హామీలను రాజగోపాల్ రెడ్డి ఈ భేటీలో ప్రధానంగా గుర్తు చేసినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కేబినెట్‌లో కీలక బాధ్యతలు అప్పగిస్తామని అప్పట్లో అధిష్ఠానం ఇచ్చిన మాటను ఆయన రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నిలబడిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందనే నమ్మకంతోనే తాను నిరంతరం శ్రమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయాల్లో కోమటిరెడ్డి సోదరుల పాత్ర అత్యంత కీలకం కావడం, ఇప్పటికే ఒకరు మంత్రిగా కొనసాగుతుండటంతో రెండో వారికి అవకాశం ఇవ్వడంపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఉత్కంఠ రేపుతోంది. ఒకే కుటుంబానికి రెండు పదవులు ఇవ్వ



డంపై గతంలో ఉన్న నిబంధనలను ఈసారి ఏ మేరకు సడలిస్తారనే అంశంపైనే రాజగోపాల్ రెడ్డి భవితవ్యం ఆధారపడి ఉంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కేబినెట్‌లో ప్రస్తుతం రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయడంతో పాటు మొత్తం మంత్రివర్గాన్ని పునర్ వ్యవస్థీకరించేందుకు ముఖ్యమంత్రి, కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికే ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. కేవలం ఖాళీలను పూరించడమే కాకుండా, పనితీరు సరిగా లేని కొందరు మంత్రులకు ఉద్వాసన పలికే యోచనలో కూడా పార్టీ ఉన్నట్లు ఢిల్లీ వర్గాల సమాచారం. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత ప్రభుత్వ ప్రతిష్టను మరింత పెంచేలా సమర్థులైన వారికి బాధ్యతలు అప్పగించాలని అధిష్ఠానం గట్టి పట్టుదలతో ఉంది. ఈ పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియలో పాత, కొత్త కలయికతో కేబినెట్‌ను సరికొత్తగా తీర్చిదిద్దాలని భావిస్తుండటంతో ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కేబినెట్ మార్పుల నేపథ్యంలో కొత్త ముఖాలకు అవకాశం ఇవ్వడం ద్వారా పార్టీలో సమతూకం తీసుకురావాలని అధినాయకత్వం భావిస్తోంది. సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం ఆధారంగా ఈ ఎంపిక ప్రక్రియ సాగనుంది. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల నుండి గెలిచిన సీనియర్ శాసనసభ్యులు చాలా కాలంగా ఈ విస్తరణ కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. కొందరు మంత్రుల శాఖలను మార్చడం ద్వారా పాలనలో వేగం పెంచవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్న తరుణంలో, ఈ మార్పులు చేర్పులు ఎవరి పదవులకు గండంగా మారుతాయోనన్న భయం కొందరిలో వ్యక్తమవుతోంది. పనితీరు ఆధారంగానే మార్కుల కేటాయింపు ఉంటుందని ఏఐసీసీ ఇప్పటికే స్పష్టం చేయడంతో మంత్రులందరూ తమ నియోజకవర్గాల్లో పట్టు నిలుపుకునే ప్రయత్నాల్లో పడ్డారు. ఈ పరిణామాలన్నింటి మధ్య రాహుల్ గాంధీతో మునుగోడు ఎమ్మెల్యే జరిపిన సంభాషణ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. కేబినెట్‌లో చోటు దక్కించుకోవడానికి ఢిల్లీ స్థాయిలో బలమైన లాబీయింగ్ అవసరమని గుర్తించిన రాజగోపాల్ రెడ్డి, నేరుగా అధిష్ఠాన చక్రవర్తిని కలవడం ద్వారా తన ప్రత్యర్థులకు గట్టి సంకేతాలు పంపారు. కేవలం రాష్ట్ర నాయకత్వంపైనే కాకుండా జాతీయ నాయకత్వంపై ఉన్న నమ్మకంతోనే ఆయన ఈ అడుగు వేసినట్లు కనిపిస్తోంది. తెలంగాణ కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాల ప్రభావం కేబినెట్ విస్తరణపై పడకుండా చూసేందుకు హైకమాండ్ స్వయంగా రంగంలోకి దిగింది. రాజగోపాల్ రెడ్డికి ఉన్న సుదీర్ఘ రాజకీయ అనుభవం, గతంలో ఎంపీగా, ఎమ్మెల్సీగా పనిచేసిన రికార్డు ఆయనకు సానుకూల అంశాలుగా మారే అవకాశం ఉంది. సమావేశం ముగిసిన అనంతరం ఢిల్లీ రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, రాజగోపాల్ రెడ్డి వినతిని రాహుల్ గాంధీ సానుకూలంగా విన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని, ఎవరి హక్కులను కాలరాయబోమని ఆయన భరోసా ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి, రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులను బేరీజు వేసుకున్న తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని అధిష్ఠానం స్పష్టం చేసింది. అయితే ఈ భేటీ ద్వారా రాజగోపాల్ రెడ్డి తన గళాన్ని బలంగా వినిపించడంలో విజయం సాధించారని ఆయన అనుచరవర్గం హర్షం వ్యక్తం చేస్తోంది. రాబోయే విస్తరణలో మునుగోడుకు ఖచ్చితంగా ప్రాధాన్యత దక్కుతుందనే ధీమాతో వారు ఉన్నారు. రాష్ట్ర కేబినెట్ పునర్ వ్యవస్థీకరణ ఎప్పుడు జరుగుతుందనే దానిపై ఇంకా అధికారిక ముహూర్తం ఖరారు కాలేదు. బడ్జెట్ సమావేశాల తర్వాత లేదా దసరా పండుగ నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధిష్ఠానం యోచిస్తున్నట్లు సమాచారం. ఈ లోగా ఆశావహులందరూ అధిష్ఠానం పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కొందరు సీనియర్లు కర్ణాటక నేతల ద్వారా ఒత్తిడి తెస్తుండగా, మరికొందరు నేరుగా కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షీ వంటి కీలక నేతలను కలుస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి మాత్రం నేరుగా రాహుల్ గాంధీని కలవడం ద్వారా అందరికంటే ఒక అడుగు ముందే ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో విశ్లేషణలు సాగుతున్నాయి. ఇంతటి ఉత్కంఠ భరిత వాతావరణంలో రాహుల్ గాంధీ ఇచ్చిన భరోసా రాజగోపాల్ రెడ్డిని మంత్రి పీఠంపై కూర్చోబెడుతుందా లేదా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఒకే జిల్లా నుండి ఇద్దరు సోదరులకు మంత్రి పదవులు ఇస్తే మిగిలిన జిల్లాల నేతల నుండి అసంతృప్తి వ్యక్తమయ్యే ప్రమాదం ఉంది. ఈ చిక్కుముడిని విప్పడం అధిష్ఠానానికి ఒక పెద్ద పరీక్షగా మారనుంది. సామాజిక సమీకరణాల పరంగా రెడ్డి సామాజిక వర్గానికి ఇప్పటికే కేబినెట్‌లో తగిన ప్రాధాన్యత ఉన్నందున, కొత్తగా ఎవరిని తీసుకున్నా సమతుల్యత దెబ్బతినకుండా చూసుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉంది. ఈ సవాలును అధిగమించి రాజగోపాల్ రెడ్డి కేబినెట్ బెర్త్ ఖరారు చేసుకుంటారో లేదో చూడాలి. తెలంగాణ కాంగ్రెస్ భవిష్యత్తు, ప్రభుత్వ స్థిరత్వం ఈ మంత్రివర్గ విస్తరణపైనే ఆధారపడి ఉన్నాయి. రాబోయే కొద్ది రోజుల్లో ఢిల్లీ నుండి వచ్చే సిగ్నల్స్ ఆధారంగానే రాష్ట్ర రాజకీయాల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయి. రాజగోపాల్ రెడ్డి ఆశలు ఫలించి ఆయనకు మంత్రి పదవి దక్కుతుందా, లేక అధిష్ఠానం మరో సమీకరణాన్ని తెరపైకి తెస్తుందా అనేది మరికొద్ది రోజుల్లో తేలనుంది. హస్తిన పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకోనున్న మునుగోడు ఎమ్మెల్యే తదుపరి అడుగులు ఎలా ఉంటాయనేది ఆసక్తికరంగా మారింది. గాంధీ భవన్ వేదికగా సాగే ఈ మంత్రివర్గ కసరత్తు ముగింపు దశకు చేరిన తరుణంలో, అదృష్టం ఎవరిని వరిస్తుందో తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడక తప్పదు.

## భీమేశ్వర స్వామి దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొన్న శ్రీనివాస్ గౌడ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం బాలాజీ లేఅవుట్ నందు భీమేశ్వర దేవాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ హాజరై స్వామివారికి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమేశ్వర స్వామి ఆశీస్సులు కృపా కటాక్షాలు చల్లని దీవెనలు ఆయురారోగ్యాలతో కూడిన జీవితాన్ని ప్రజలందరికీ ప్రసాదించాలని ఆకాంక్షించాలి, అదేవిధంగా భీమేశ్వర స్వామి వార్షికోత్సవాలు ఇంత ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి ఆ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు అంజన్న, శ్రీనివాస్, వెంకట్ కుమార్, వేణు, బాలాజీ, రామక్రిష్ణ, చైతన్య మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**మునుగోడు విశాలభారతి:** మునుగోడు మండలం రత్తిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను రత్తిపల్లి మాజీ సర్పంచ్ మాదగోని రాజేష్ గౌడ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జిట్టగోని పార్వతమ్మ భర్త యాదయ్య రూ.17,000/ జిట్టగొని సునీత భర్త స్వామి రూ.10,500 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు గాదె భిక్షమయ్య, గాదె నృసింహ, గాదె శ్రీను, బొల్గూరి మల్లయ్య, గాదె రాజు, రడం మారయ్య తదితరులు పాల్గొన్నారు.

## కందికొండలో అటవీ సంరక్షణపై అవగాహన సదస్సు



**విశాలభారతి :** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కందికొండ గ్రామంలో అటవీశాఖ మరియు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అటవీ సంరక్షణ, వన్యప్రాణుల రక్షణ, అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు అడవుల ప్రాముఖ్యత, అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత, వేసవి కాలంలో అడవుల్లో మంటలు చెలరేగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు వివరించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం. నరేష్, గ్రామ సర్పంచ్ తుడుసు నాగార్జున్ పాల్గొని మాట్లాడారు. అడవులు ప్రకృతి సమతుల్యతకు మూలాధారమని, వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అడవుల్లో నిర్లక్ష్యంగా నిప్పు పెట్టడం వల్ల వన్యప్రాణులు, పక్షులు, చెట్లు తీవ్ర నష్టానికి గురవుతాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు అడవుల్లో మంటలు కనిపించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, అటవీ సంపదను కాపాడేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు, ప్రజాప్రతినిధులు, అటవీశాఖ మరియు అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మహబూబాబాద్ ఆర్డీవోగా ఎం. రాజేశ్వరి బాధ్యతల స్వీకరణ



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారిణి (ఆర్డీవో)గా ఎం. రాజేశ్వరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై మహబూబాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మహబూబాబాద్ ఆర్డీవో కార్యాలయంలో విధుల్లో చేరారు. రెవెన్యూ శాఖలో తనకున్న అనుభవంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఎం. రాజేశ్వరి తెలిపారు. జిల్లా అధికారులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## సైబర్ భద్రతపై విద్యార్థులకు అవగాహన





**మహబూబాబాద్ విశాల భారతి :** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షీ టీం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని రెండు విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, జన్‌టీయూ నివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, విద్యార్థినులకు లింగ సమానత్వం, మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మహిళా చట్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం అధికారులు సమాజంలో ప్రతి వ్యక్తిని గౌరవంగా చూడాల్సిన అవసరాన్ని వివరించారు. సమ్మతి (కాన్సెంట్) యొక్క చట్టపరమైన ప్రాముఖ్యతను తెలియజేస్తూ, అనుమతి లేకుండా చేసే ఏ చర్య అయినా నేరంగా పరిగణించబడుతుందని స్పష్టం చేశారు. సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం వంటి అంశాలపై విద్యార్థులను అప్రమత్తం చేశారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే లైంగిక వేధింపులు, స్ట్రీట్ హరాస్మెంట్, వెంటపడడం వంటి ఘటనలు ఎదురైతే వెంటనే షీ టీం హెల్ప్‌లైన్ నంబర్ 8712656935కు సమాచారం అందించాలని తెలిపారు. టీనేజ్ వయస్సులో ఎదురయ్యే భావోద్వేగ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే మార్గాలను వివరించి, అవసరమైతే షీ టీం సహాయం పొందవచ్చని పేర్కొన్నారు. రోడ్డు భద్రతపై కూడా అవగాహన కల్పించిన అధికారులు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్‌కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఎఎస్‌ఐ సుధాకర్‌తో పాటు సిబ్బంది అరుణ, పార్వతి, ప్రియాంక, హైమావతి పాల్గొన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది, సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో భరోసా టీం అవగాహన సదస్సు




**మహబూబాబాద్ విశాల భారతి :** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక (90 రోజుల కార్యాచరణ) లో భాగంగా మహబూబాబాద్ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అనంతారం రాంసింగ్ తండా, ప్రతిభ కోచింగ్ అకాడమీలో భరోసా టీం ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరిష్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో భరోసా టీం సభ్యులు ప్రజలకు వివిధ సామాజిక, న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. నేటి సమాజంలో నేరాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ కీలక పాత్ర పోషించాలని, అప్రమత్తంగా ఉంటే అనేక నేరాలను ముందుగానే అరికట్టవచ్చని సూచించారు. పిల్లల పెంపకంలో లింగ వివక్షకు తావు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, బాల్య వివాహాల నిర్మూలనకు సమాజం సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, మహిళలపై హింస, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలు, మాదకద్రవ్యాల వినియోగం వంటి అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. సైబర్ నేరాల బారిన పడిన వారు వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని, మహిళలను వేధించే లేదా అసభ్యంగా ప్రవర్తించే వారిపై ధైర్యంగా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. భరోసా సెంటర్ సేవలు, మహిళలు, చిన్నారులకు అందిస్తున్న సదుపాయాలు, పోక్సో చట్టం నిబంధనల గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో భరోసా ఇంచార్జి ఎస్ఐ వి. దీపిక, కోఆర్డినేటర్, కౌన్సిలర్ సి.హెచ్. జ్యోష్ణ, లీగల్ సపోర్ట్ పర్సన్ ఎస్. శ్వేత, సపోర్ట్ పర్సన్స్ కె. బేబీ, పి. రేణుక, ఏఎన్ఎం ఎం. పార్వతి, డీఈఓ, అకౌంటెంట్ బి. రేణుక, రిసెప్షనిస్ట్ కె. మౌనికతో పాటు పలువురు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యానికి చర్యలు



**తాసిల్దార్ ఆంజనేయుల సూచనలు**

ఆలేరు,విశాల భారతి: వీధి దీపాల నిర్వహణ, మురికి కాలువల శుద్ధి, పూడికతీత ఆయిల్ బాక్సులు నిర్మాణం, పాడైన ఇళ్లు గుర్తింపు వంటి అంశాలపై అతివ్యవస్థాపిత చర్యలతో గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం సాధించాలని ఆలేరు మండల తాసిల్దార్ ఆంజనేయులు శనివారం కోరారు. ఆలేరు మండలం మందనపల్లి, టంగుటూరు, శారాజీపేట గ్రామాలలో జరిగిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక గ్రామసభల కార్యక్రమంలో తాసిల్దార్ మాట్లాడారు. గ్రామసభలలో సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని ప్రభుత్వం నిర్ణయించిన 99 రోజుల ప్రణాళిక అంశాలను క్షేత్రస్థాయిలో వివరించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓటర్ల జాబితా, 2027 ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాల గురించి పౌరులు అవగాహన పొందారు. అలాగే పంటల వికేంద్రీకరణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు మార్గదర్శక శిక్షణ ఇవ్వబడింది. తాగునీటి సరఫరా పనుల్లో క్లోరినేషన్, పైప్‌లైన్ లీకేజీల నివారణపై చర్యలు తీసుకోవాలని, వర్షపు నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు, కట్టడాల నిర్మాణం అత్యవసరం అని తాసిల్దార్ వివరించారు. వర్షాకాల సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు అవసరం ఉండే విషయానికి కూడా ఆయన గౌరవార్థంగా ప్రతిపాదించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో డ్రగ్ నివారణ, రోడ్డు ప్రమాదాల తగ్గింపు, శాంతి భద్రతల పరిరక్షణపై అవగాహన ఇస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ప్రోగ్రామ్‌లో గ్రామ సర్పంచ్ కంతి మధు, ఉపసర్పంచ్ శ్రీధర్, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, ఎంపీఓ అనురాధ దేవి, ఏపీఓ అరుణకుమారి, ఆర్డబ్ల్యూఏఈ సుప్రియ, పంచాయతి రాజు ఏఈ నవ్య, పంచాయతీ కార్యదర్శి సుజాత, ఆర్ ఐ పూర్ణచంద్రరావు, భద్రయ్య, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ రేణుక, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు మరియు గ్రామ పంచాయత్ సిబ్బంది పాల్గొన్నారు.

## రుతుపవనాల నేపథ్యంలో వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలి



**సీఎస్ రామకృష్ణారావు**

**మహబూబాబాద్, విశాలభారతి:**

మరో రెండు రోజుల్లో రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రాన్ని తాకనున్న నేపథ్యంలో జిల్లాల్లో వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లను ఆదేశించారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా వరి కొనుగోళ్లు, జూన్ 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మండల మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన వడ్లను వెంటనే లారీల ద్వారా మిల్లులు, గోదాములకు తరలించాలని సూచించారు. రుతుపవనాల ప్రభావం ప్రారంభమయ్యేలోపు రెండు మూడు రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. జూన్ 9న మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జూన్ 9న నిర్వహించనున్న మండల మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సీఎస్ సూచించారు. జిల్లాల నుంచి మహిళా సంఘాల సభ్యులను తీసుకువెళ్లే బస్సులు సాయంత్రం 4 గంటల లోపు పరేడ్ గ్రౌండ్‌కు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రయాణ సమయంలో మహిళలకు భోజనం, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. అదే విధంగా నీట్ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల నిర్వహణతో పాటు విద్యార్థులకు యూనిఫాంల కుట్టింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ నాగలక్ష్మి, డీఆర్‌డీఓ ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన్ రాజు, డీఎస్ఓ రమేష్, డీఎం సివిల్ సప్లై నరసింహారావు, ఇంటర్మీడియట్ అధికారి మధర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలు




**ఆలేరు, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలు శనివారం ఆలేరు నియోజకవర్గం వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ అభిమాన నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిసి వారి ఆశీస్సులు అందుకున్నారు. యాదగిరిగుట్టలోని బీర్ల నిలయంలో నిర్వహించిన ప్రధాన కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఆలేరు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ క్రేన్ గజమాల ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జన్మదిన వేడుకల్లో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేయడంతో పాటు పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు పండ్లు, ఆహార పదార్థాలు పంపిణీ చేసి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బీర్ల నిలయం వద్ద అభిమానులు, నాయకులు, ప్రజాప్రతినిధుల రాకపోకలతో సందడి వాతావరణం నెలకొంది. జన్మదిన వేడుకలు ఆనందోత్సాహాల మధ్య అట్టహాసంగా సాగాయి. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జాయింట్ కలెక్టర్ వెంకారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, వివిధ మండలాల సర్పంచులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు.

## పెంచిన ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలి

**ఏఐకేఎంఎస్ డిమాండ్**

**మహబూబాబాద్ విశాలభారతి:** ఎరువుల ధరలను ప్రైవేటు కంపెనీలు ఇష్టానుసారంగా పెంచుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిపై నియంత్రణ సాధించడంలో విఫలమయ్యాయని అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ జడ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్ విమర్శించారు. శనివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బట్టు అంజయ్య భవనంలో నిర్వహించిన ఏఐకేఎంఎస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే డీజిల్, పెట్రోల్ ధరల పెరుగుదలతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ప్రైవేటు ఎరువుల కంపెనీలు కాంప్లెక్స్ ఎరువుల ధరలను ఒక బస్తాపై రూ.100 నుంచి రూ.500 వరకు పెంచడం రైతులకు మరింత భారంగా మారిందన్నారు. పెరిగిన ఎరువుల ధరలను తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు పండించే అన్ని రకాల పంటలకు వాస్తవ సాగు ఖర్చులను పరిగణనలోకి తీసుకొని డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు సి2 వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ప్రకటించాలని కోరారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నామమాత్రంగా పెంచిన మద్దతు ధరలను పునఃసమీక్షించి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని అన్నారు. కల్తీ విత్తనాలు, ఎరువుల విక్రయాలను అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచాలని, బ్యాంకులు రైతులకు వ్యవసాయ రుణాలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతాంగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు వరికి ప్రకటించిన బోనస్, ఖరీఫ్‌రబీ సీజన్లకు సంబంధించిన బకాయిలను రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని కోరారు. ఇంకా కల్లాలపై ఉన్న వరి, మొక్కజొన్న పంటల కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు తోకల వెంకన్న, చింతా వెంకన్న, రామగిరి బిక్షం, నున్న ఉపేందర్, దేవపంగు బిక్షం, పూణెం పాపారావు, మట్టపెల్లి వీరభద్రం, టేకుమట్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# పవన్ కల్యాణ్‌పై కవిత 'కబ్జా' బాణం!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



హైదరాబాద్ శివార్లలోని జన్వాడ ప్రాంతంలో గల 'కోడి చెరువు' భూముల ఆక్రమణ అంశం తెలుగు రాష్ట్రాల్లో ఒక్కసారిగా రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన సంచలన వ్యాఖ్యలు సరికొత్త దుమారానికి తెరలేపాయి. జూబ్లీ హిల్స్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె ఈ వివాదాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. గతంలో పవన్ కల్యాణ్ స్వయంగా చేసిన సవాల్‌ను గుర్తు చేస్తూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిబంధనల ఉల్లంఘన నిజమని తేలితే భూమిని ప్రభుత్వానికి రాసిస్తానని చెప్పిన మాట ప్రకారం.. ఆ స్థలాన్ని తక్షణమే తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. జన్వాడ సమీపంలో ఉన్న కోడి చెరువుకు చెందిన సుమారు పది ఎకరాల స్థలాన్ని ఆక్రమించి పవన్ కల్యాణ్ తన ఫామ్‌హౌస్‌ను నిర్మించారంటూ గత కొన్ని రోజులుగా విపక్షాలు, పలు సామాజిక సంఘాలు క్షేత్రస్థాయి నివేదికలతో ఆరోపణలు గుప్పిస్తున్నాయి. ఈ వ్యవహారంపై గతంలోనే స్పందించిన జనసేనాని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించి పూర్తి వివరణ ఇచ్చారు. తాను చట్టబద్ధంగానే రిజిస్ట్రేషన్ పత్రాల ఆధారంగా ఆ భూమిని కొనుగోలు చేశానని, ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. ఒకవేళ అది గనుక చెరువు శిఖం భూమి అని అధికారికంగా రుజువైతే ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ప్రభుత్వానికి ఇచ్చేస్తానని సవాల్ విసిరారు. ఇదే అంశాన్ని ఇప్పుడు కల్వకుంట్ల కవిత బలమైన రాజకీయ అస్త్రంగా మార్చుకున్నారు. నీటి పారుదల శాఖకు చెందిన అధికారిక భూ రికార్డులను తాము క్షుణ్ణంగా పరిశీలించామని ఆమె పేర్కొన్నారు. కోడికుంట సర్వే నంబర్ 706 పరిధిలో ఉన్న ఆ పది ఎకరాల స్థలం పూర్తిగా చెరువు శిఖం భూమి అని ప్రభుత్వ రికార్డులు స్పష్టం చేస్తున్నాయని వెల్లడించారు. సాంకేతిక ఆధారాలు బహిర్గతమైన నేపథ్యంలో.. పవన్ కల్యాణ్ గతంలో ఆవేశంగా మాట్లాడిన మాటలపై నిలబడాలని హితవు పలికారు. సదరు వివాదాస్పద స్థలంలో చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేసిన భారీ కంటైనర్లు, పోసిన మట్టిని తక్షణమే తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. రాష్ట్రానికి సంబంధించిన వనరులను, ఇక్కడి అస్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం ఎవరికీ సాధ్యం కాదని కవిత హెచ్చరించారు. ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కొన్ని శక్తులు కావాలనే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాయని ఆరోపించారు. సుమారు పన్నెండు వందల మంది అమరవీరుల త్యాగాలు, కోట్ల మంది తెలంగాణ ప్రజలు కడుపు కట్టుకుని చేసిన సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే ఈ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని గుర్తు చేశారు. ఈ పవిత్రమైన గడ్డ ఎవరిదో ఒకరి తాతల, ముత్తాతల జాగీరు కాదని, ఇది బరాబర్ ఇక్కడి స్థానిక ప్రజల సొంత జాగీరు అని ఉద్ఘాటించారు. దేశ రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం భారతదేశంలో ఎవరైనా, ఎక్కడైనా రాజకీయం చేసుకునే స్వేచ్ఛ ఉందని కవిత అభిప్రాయపడ్డారు. ప్రజా క్షేత్రంలో నిలబడేటప్పుడు కనీస నైతిక విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని హితవు పలికారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇక్కడి సహజ వనరులను విచ్చలవిడిగా దోచుకున్న వారే, ఇప్పుడు మళ్లీ రాజకీయ లబ్ధి కోసం ఇక్కడి ప్రాంతీయ సెంటిమెంట్‌ను వాడుకోవాలని చూస్తున్నారని ఏపీ నేతలను ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు గుప్పించారు. తెలంగాణ సమాజాన్ని, ఇక్కడి సంస్కృతి, కళలను కేవలం తమ సొంత వ్యాపారాల కోసం, రాజకీయ అవసరాల కోసం ఉపయోగించుకున్నారే తప్ప, ఈ గడ్డపై ఎవరికీ నిజమైన ప్రేమ లేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కవిత ఇదే వేదికగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను రేవంత్ రెడ్డి సర్కార్ బడాబాబులకు కట్టబెడుతోందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, మంత్రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు భూదందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. హైడ్రా పేరిట కేవలం సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తూ, అధికారంలో ఉన్న పెద్దల అక్రమ కట్టడాలను మాత్రం తాకడం లేదని మండిపడ్డారు. విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు తాము సుప్రీంకోర్టు వరకు వెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గత, ప్రస్తుత పాలన తీరును పోలుస్తూ 'కేటీఆర్' అనే మూడక్షరాలపై కవిత ఆసక్తికరమైన పొలిటికల్ పంచ్ వేశారు. నాడు, నేడు.. ఎప్పుడైనా రాష్ట్రంలో కేటీఆర్ పాలనే నడుస్తోందంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో 'కేటీఆర్' అంటే.. కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, కల్వకుంట్ల రామారావు అని వివరించారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆ ముగ్గురు నేతలు రాత్రింబగళ్లు శ్రమించి రాష్ట్ర అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం అంకితభావంతో పని చేశారని గుర్తుచేశారు. ఆ హయాంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని గర్వంగా చెప్పుకొచ్చారు. నేటి కాంగ్రెస్ పాలనలోని 'కేటీఆర్' అనే పదానికి కవిత సరికొత్త నిర్వచనం ఇచ్చారు. ప్రస్తుతం 'కేటీఆర్' అంటే.. కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనను పూర్తిగా ముఖ్యమంత్రి తన కుటుంబ సభ్యుల చేతుల్లో పెట్టారని విమర్శించారు. ఒకవైపు కొండల్ రెడ్డి, మరోవైపు తిరుపతి రెడ్డి అధికార పీఠాన్ని శాసిస్తూ రాష్ట్ర వనరులను దోచుకుంటున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి వీరికి పూర్తి సహకారం అందిస్తూ ప్రజాపాలనను పక్కనబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటి కేటీఆర్ పాలనకు, నేటి కేటీఆర్ దందాకు నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. జనసేన వర్గాలు మాత్రం ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాయి. తెలంగాణ ప్రాంతంలో జనసేన పార్టీ వేగంగా పుంజుకుంటోందని, ఆ ప్రజాదరణను చూసి ఓర్వలేకే కొందరు కావాలని బురదజల్లుతున్నారని ఆ పార్టీ ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మండిపడ్డారు. వేరే ఎవరో చేసిన వివాదాస్పద భూ కబ్జాలను, పవన్ కల్యాణ్ ఆస్తికి ఆపాదిస్తూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సైతం ప్రాథమిక పరిశీలనలో అక్కడ ఎలాంటి పక్కా శాశ్వత నిర్మాణాలు జరగలేదని, కేవలం చట్టబద్ధమైన స్థలానికే ఫెన్సింగ్ వేశారని స్పష్టం చేసిన విషయాన్ని జనసైనికులు గుర్తుచేస్తున్నారు. మొత్తానికి, పవన్ కల్యాణ్ ఫామ్‌హౌస్ వివాదాన్ని రీఓపెన్ చేయడం ద్వారా కవిత అటు జనసేనను, ఇటు అధికార కాంగ్రెస్ పార్టీని ఏకకాలంలో ఇరుకున పెట్టే వ్యూహాన్ని అమలు చేసినట్లు కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై, భూ అక్రమాలపై తమ పార్టీ మరింత ఉధృతంగా పోరాడుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ 'కోడి చెరువు' వివాదం ముమ్ముందు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఎలాంటి సెగలు పుట్టిస్తుందో, ఇరు పార్టీల మధ్య ఎలాంటి సవాల్ ప్రతిసవాళ్లకు దారితీస్తుందో చూడాలి.

## ఈవీఎంల గోదామును తనిఖీచేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



**మహబూబాబాద్ విశాలభారతి:** కురవి రోడ్ కలెక్టరేట్ దగ్గరలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు (ఈవీఎంలు), వివిప్యాట్‌లు భద్రపరిచిన గోదామును జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ శనివారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఈ పరిశీలన చేపట్టారు. గోదాములో పటిష్ట భద్రత నడుమ భద్రపరిచిన ఈవీఎంలు, వివిప్యాట్‌లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రి నిల్వ ఉంచిన గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా చర్యల్లో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, గోదాం భద్రతా వ్యవస్థలను సమీక్షించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పవన్ కుమార్, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో గళమెత్తిన మెండి భాస్కర్



**బూర్గంపాడు, విశాలభారతి:** వేపలగడ్డ గ్రామపంచాయతీలో శనివారం ఉదయం జరిగిన ప్రజా పాలన గ్రామసభలో ఆదివాసీల మండల నాయకుడు మెండిభాస్కర్ గళం మెత్తాడు. ప్రభుత్వాలు మారిన పాలనలో మార్పు లేదని ఆదివాసీల గ్రామాలు అభివృద్ధికి నోచుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేపలగడ్డ గ్రామపంచాయతీలో ఆదివాసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బీటీ రోడ్డు మంజూరై మూడు సంవత్సరాలు గడుస్తున్న పూర్తి కాలేదని అధికారుల పర్యవేక్షణ కరువైందని వాపోయారు. అదేవిధంగా డ్రైనేజీలు మంజూరు చేయాలని ఈ సందర్భంగా కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటువంటి ఆరు గారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రజా పాలనవేదికగా ప్రభుత్వ పనితీరును గుర్తుచేశారు.

## మహిళా కానిస్టేబుల్ శ్రీలతకు సత్కారం



**విశాలభారతి, గోదావరిఖని :** 3వ ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో యోగా విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించి రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు గౌరవం తీసుకువచ్చిన పెద్దపల్లి జోన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ శ్రీలతను ఈరోజు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఘనంగా సత్కరించారు.ఇటీవల హర్యానా రాష్ట్రంలోని కర్నాల్‌లో మే 23, 2026న నిర్వహించిన 3వ ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో 35 నుంచి 45 సంవత్సరాల వయో విభాగంలో జరిగిన యోగా పోటీల్లో శ్రీలత ప్రతిభ కనబర్చి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఆమెకు అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి శాఖకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, కమాన్‌పూర్ ఎస్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై సమగ్ర చర్చ



**దేవరుప్పుల విశాలభారతి:** మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి ప్రజలను భాగస్వామి చేసుకుంటూ ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందజేసేలా క్షేత్రస్థాయి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని,ప్రజల సమస్యలు పరిష్కాకారమే ధ్యేయంగా మన పనితీరు ఉండాలని,గ్రామ అభివృద్ధి,గ్రామ సమస్యల గుర్తింపు,పదకాల అమలులో పారదర్శకత పెంపుకోసం సమగ్ర చర్చ జరిపారు.ఈ కార్యక్రమంలో విద్య శాఖ అధికారులు,రెవెన్యూ అధికారులు,ఆరోగ్యశాఖ అధికారులు,ఉప సర్పంచ్ నర్రా కోమలత,పంచాయతీ సెక్రెటరీ,గ్రామపంచాయతీ వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఓటు హక్కుల రక్షణకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలి

**డిసిసి అధ్యక్షురాలు ధన్వంతీ లక్ష్మీనారాయణ నాయక్**




**జనగామ, విశాలభారతి:** స్టేషన్ ఘణపూర్ లో మాజీ ఉపముఖ్యమంత్రి ఎంఎల్ఎ కడియం శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన బూత్ లెవెల్ ఏజెంట్ల (బిఎల్ఎ) శిక్షణ సమావేశంలో డిసిసి అధ్యక్షురాలు ధనవంతి లక్ష్మీనారాయణ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓటరు జాబితాలో అక్రమాలను అడ్డుకోవడంలో బిఎల్ఏ ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రతి పౌరుడి విలువైన హక్కు అని దానిని పరిరక్షించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, పిలుపునిచ్చారు. ఓటరు జాబితాలో అనుమానాస్పద మార్పులు, అక్రమ చేర్పులు, తొలగింపులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే రాహుల్ గాంధీ పిలుపుమేరకు బిఎల్ఏ లకు అవగాహన కల్పిస్తూ ఫారం6, ఫారం7, ఫారం8,ల వినియోగంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఓటు రక్షించ బడేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని, ఆమె కోరారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు ఎమ్మెల్యే శంకర్ నాయక్, బూత్ లెవెల్ ఏజెంట్స్, శిక్షణ ట్రైనర్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ పరిశీలకులు దుద్దిల్ల శ్రీనివాస్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూడా చైర్మన్ ఇనుకాల వెంకటరామిరెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, డిసిసి ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, గుడి వంశీధర్ రెడ్డి, కీసర దిలీప్ రెడ్డి, స్టేషన్ ఘన్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య, స్టేషన్ ఘన్పూర్ మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్, జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్లు కొల్లూరి శివ, మండల అధ్యక్షులు శిరీష రెడ్డి, కోళ్ల రవి గౌడ్, నూకల ఐలయ్య, సురేష్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిరా, ఓబీసీ సెల్ లోక్కుంట్ల ప్రవీణ్, ఎస్సీ సెల్ వేముల మల్లేష్, పలువురు కాంగ్రెస్ నాయకులు బిఎల్ఏ లు పాల్గొన్నారు.

## పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం,విశ్వాసం పెంపొందించాలి



**పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా**

**విశాలభారతి, గోదావరిఖని :**

నేరస్తులకు శిక్ష పడడంలో కోర్టు డ్యూటీ పోలీస్ అధికారుల పాత్ర కీలకమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. శనివారం సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కోర్టు డ్యూటీ,కోర్టు లైజనింగ్ పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ముఖ్యంగా మహిళలపై జరిగే నేరాలు,ఆస్తి సంబంధిత నేరాలు, శారీరక దాడులు తదితర కేసుల్లో నిందితులకు తప్పనిసరిగా శిక్ష పడే విధంగా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి, బలమైన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టి, న్యాయస్థానంలో సమర్థవంతంగా కేసులను వాదించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బాధితులకు సత్వర న్యాయం అందేలా దర్యాప్తు అధికారులు,కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నేరస్తులకు శిక్ష పడడం ద్వారా బాధితుల్లో న్యాయ వ్యవస్థపై విశ్వాసం పెరుగుతుందని, సమాజంలో నేరాల నియంత్రణకు కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.ఎన్‌బీడబ్ల్యూలు, సమన్లను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.కేసులు విచారణలో ఉన్నప్పుడు కేవలం కోర్టుకు హాజరు కావడం మాత్రమే కాకుండా, నిందితులకు శిక్షలు పడేలా చూడటం కూడా పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు.సరైన సమయంలో సమన్లు జారీ చేయడం, అవసరమైతే నిందితుల ఆస్తులను జప్తు చేయడం వంటి ప్రక్రియలను ఆలస్యం చేయకుండా వెంటనే చేపట్టాలన్నారు.రామగుండం కమిషనరేట్ పనితీరు కోర్టు డ్యూటీ,లైజనింగ్ అధికారుల పనితీరుపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా బాధితులు పోలీసులను ఎంతో నమ్మకంతో ఆశ్రయిస్తారని, నేరస్తులకు శిక్ష పడేలా చేసి వారికి భరోసా కల్పించడం పోలీసుల బాధ్యత అని పేర్కొన్నారు.సాక్షుల వాంగ్మూలాలు,సాంకేతిక ఆధారాలు,వైద్య ఆధారాలను సమగ్రంగా సేకరించి కోర్టుకు సమర్పిస్తేనే నేరస్తులకు శిక్ష విధించడం సాధ్యమవుతుందని తెలిపారు.తద్వారా నేరస్తుల్లో నేరాలకు పాల్పడాలనే ఆలోచనకే భయం కలిగే పరిస్థితి రావాలని అన్నారు.రానున్న రోజుల్లో నేరాల నిరూపణ శాతాన్ని మరింత పెంచి, నిందితులకు శిక్షలు పడేలా చేయడం ద్వారా బాధితుల్లో పోలీస్ వ్యవస్థపై మరింత విశ్వాసం పెంపొందించాలన్నారు. నేరం జరిగిన వెంటనే,ఆ సంఘటన ప్రభావం తగ్గకముందే శిక్ష విధించబడితే అది నేరస్తులపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.కాంటెస్టెడ్ కేసుల్లో నిందితులు బాధితులను బెదిరించడం లేదా ఇతర ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉంటుందని,అలాంటి సందర్భాల్లో కోర్టు డ్యూటీ అధికారులు బాధితులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే సంబంధిత ఎస్‌హెచ్‌వో, ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు.ఎప్పటికప్పుడు సీసీలను పరిశీలిస్తూ, సాక్షులు మరియు ముద్దాయిలు కోర్టుకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బందికి వృత్తిపరంగా లేదా వ్యక్తిగతంగా ఏవైనా సమస్యలు ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు.సమర్థవంతంగా పనిచేసే సిబ్బందికి తగిన గుర్తింపు, ప్రోత్సాహకాలు తప్పకుండా ఉంటాయని పేర్కొన్నారు.మీ పనితీరుతోనే బాధితులకు న్యాయం చేస్తూ,పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెంపొందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.పలు కేసుల్లో నిందితులకు శిక్షలు పడడంలో కీలక పాత్ర పోషించిన కోర్టు డ్యూటీ సిబ్బంది,కోర్టు లైజనింగ్ అధికారులను పోలీస్ కమిషనర్ శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, వర్టికల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్,బాబురావు, ఎస్ఐ వినీత,కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి కేసు నమోదు



**రాజేంద్రనగర్, విశాలభారతి :** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల వివరాల ప్రకారం, జూన్ 6, 2026 తేదీన కానిస్టేబుల్ ఎం. నరేష్ (PC11036) మరియు హోం గార్డ్ ఏ. వెంకట్రాములు (HG1704) విధుల్లో ఉండగా, మధ్యాహ్నం సుమారు 3:34 గంటలకు పెద్దషాపూర్ గ్రామానికి చెందిన గోపనమోని రమేష్ యాదవ్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. పెద్దషాపూర్ గ్రామ పరిధిలోని నాగసముద్రం చెరువులో ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలుతున్నట్లు సమాచారం అందింది. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు చెరువులో తేలుతున్న మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. మృతుడు సుమారు 4550 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వ్యక్తిగా భావిస్తున్నారు. శవం పూర్తిగా కుళ్లిపోయి ఉండడంతో గుర్తుపట్టడం కష్టంగా మారింది. ముఖం మరియు శరీరం చాలా వరకు కుళ్లిపోయి, చేతులు, కాళ్లపై చర్మం ఊడిపోయిన స్థితిలో ఉంది. మృతుడికి పెద్ద గడ్డం ఉండగా, ఎత్తు సుమారు 5.2 అడుగులు, చామనచాయ వర్ణం కలిగి ఉన్నాడు. మృతుడు ఖాకీ రంగు షర్ట్, నీలం రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉండగా, నడుముకు ఎరుపు రంగు తువ్వాలు కట్టుకున్నాడు. కుడిచేతికి తెలుపు రంగు కడియం ఉంది. ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలిసిన వారు శంషాబాద్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ కె. నరేందర్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

## ఎన్ఎమ్ఎమ్ఎస్ పథకానికి మాధాపురం విద్యార్థి



**దేవరుప్పుల విశాలభారతి :** మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మాధాపురం గ్రామానికి చెందిన విద్యార్థి ధరావత్ రిత్విక్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ పథకానికి ఎంపిక కావడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరగోని రమేశ్ తెలియచేశారు. జనగామ జిల్లాలో మొత్తం 36 మంది విద్యార్థులు ఈ పథకానికి ఎంపిక కాగా మాధాపురం ఉన్నత పాఠశాల నుండి రిత్విక్ అందులో స్థానం సంపాదించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకంలో ఎంపికైన విద్యార్థులకు 4 సంవత్సరాల పాటు సంవత్సరానికి 12 వేల రూపాయల చొప్పున వారి ఖాతాకు నేరుగా అందజేస్తారని ఉపాధ్యాయులు తెలిపారు.

## గ్రామ కమిటీని ఎన్నుకున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



**దేవరుప్పుల విశాలభారతి** : టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీరెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ఆదేశాల మేరకు,దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో దేవరుప్పుల మండలం, ధర్మాపురం గ్రామం,లక్ష్మణ్ తండా గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. ధర్మపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా బింగి యాకయ్యను,లక్ష్మణ్ తండా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా భూక్యా వీరేష్ ను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాలతో సత్కరించి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీ సిద్ధాంతాలు,రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నూతన అధ్యక్షులు కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.గ్రామ స్థాయిలో పార్టీని మరింత పటిష్టంగా తీర్చిదిద్దేందుకు కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు.నూతన అధ్యక్షులు బింగి యాకయ్య, భూక్యా వీరేష్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి గారికి,ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారికి,మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ గారికి, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ధర్మ రెడ్డి,తోటకూరి పాండు, మైనార్టీ,ఎస్టీ,బిసి మండల అధ్యక్షులు మహ్మద్ రసూల్, భూక్యా సజ్జన్, కాడబోయిన గణేష్, మండల నాయకులు ఓడపల్లి రవి,బోనగిరి యాకన్న,దావెర అనిల్ కుమార్,బానోత్ రామచంద్రు, గుగులోత్ రాజేందర్, దౌపాటి రవి, లక్ష్మణ్ తండా సర్పంచ్ సుధాకర్,దౌపటి నరసయ్య, ఉప సర్పంచ్ సంగీ రేణుక, మోటికే చంద్రశేఖర్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గనుపాక ప్రదీప్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

## చెట్లను నాటండి పర్యావరణాన్ని రక్షించండి

**దామరవంచ సర్పంచ్ సనుప సుజాత సుదర్శన్**



**విశాలభారతి, గూడూరు:** గూడూరు మండలం దామరవంచ గ్రామం లో ప్రపంచ పర్యావరణ కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సనుప సుజాత సుదర్శన్ మొక్కలను నాటారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని పర్యావరణాన్ని రక్షించే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని పర్యావరణాన్ని రక్షించాలని మొక్కలు నాటడం వలన మన జీవన ప్రమాణాలు పెంచుకోవచ్చని రాబోయే తరాలకు మనం ఇచ్చే గొప్ప ఆస్తి పర్యావరణం మాత్రమే అని ఆమె అన్నారు ప్లాస్టిక్ నిషేధిద్దాం భూమాతను కాపాడుకుందాం మొక్కలు లేని భూమి ప్రాణం లేని శరీరం లాంటిది అలాగే ఇంటి వద్ద తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా వేయాలని ప్రజల కు సూచించారు ఈ కార్యక్రమంలో స్పెషల్ అధికారి ఏవో అబ్దుల్ మాలిక్ గ్రామపంచాయతీ కార్యదర్శి సుమన్ ఉప సర్పంచ్ కందికట్ల ఉపేందర్ ఆశ వర్కర్లు అంగన్వాడీ టీచర్లు స్కూల్ టీచర్లు వివిధ శాఖ అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమ పాటల పూతోట పెరుమాండ్ల శ్రీనివాస్

**విశాలభారతి, గూడూరు:**

గూడూరు మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన పెరుమాండ్ల రామస్వామి, పద్మల, పెద్ద కుమారుడు పెరుమాండ్ల శ్రీనివాస్, చిన్నతనం నుండే కళా రంగం వైపు ఎక్కువగా ఇష్టపడేవాడు అతనికి ఐదవ తరగతి నుండి పాటలు పాడమంటే ఎంతో ఇష్టపడేవాడు అతను జానపద సాంస్కృతిక పాటలు పాడుతూ తన గొంతును ఎక్కడపడితే అక్కడ వినిపించేవాడు. తెలంగాణ మల్లీ దశ ఉద్యమ రాష్ట్ర ఏర్పాటులో తన పాటల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో గూడూరు మండలంలోనే ముందు వరుసలో ఉన్న ఉద్యమ గాయకుడు అతనే పెరుమాండ్ల శ్రీనివాస్. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ధూంధాం, ప్రజా గర్జన, సింహ గర్జన, సకల జనుల సమ్మె, వంటావార్పు, రైల్ రోకో, సాగర హారం, మిలియన్ మార్చ్, గుడిబందు, బడి బందు, లాంటి కార్యక్రమాలల్లో ఉద్యమ కళాకారుడిగా గాయకుడిగా ముందుండి గోసి గొంగడి ధరించి కాళ్లకు గజ్జలు కట్టుకొని తను పాడిన తెలంగాణ పాటల ద్వారా ప్రజల్ని చైతన్యం చేసి ఎన్నో కష్టనష్టాలను ఆయన అనుభవించాడు, అతనీ ప్రతిభను గుర్తించి అప్పటి ప్రభుత్వం గూడూరు మండల ఉత్తమ అవార్డు గ్రహీత గాయకుడిగా అతనికి 10,116 నగదు ప్రోత్సాహంతో పాటు సన్మానం చేయడం జరిగింది. తెలంగాణ ఉద్యమ సమయంలో పెరుమాండ్ల శ్రీనివాస్, రసమయి బాలకిషన్, విమలక్క, నేర్నాల కిషోర్, గిద్దె రాంనర్సయ్య, గర్జన, అంతడుపుల నాగరాజు, దరువు అంజన్న, దరువు ఎల్లన్న, కొమ్మిరే వెంకన్న, యోచన, ధారా దేవేందర్, బండ వెంకన్న, లాంటి గొప్ప గొప్ప కళాకారులతో ధూంధాం వేదికల మీద పాటలు పాడటం కూడా జరిగింది. హరితహారం మహిళల పై అత్యాచారాలు బడిబాట నిరుద్యోగ యువతకు శిక్షణ స్వచ్ఛభారత్ లాంటి కార్యక్రమాలపై పాటలు పాడుతూ ప్రజల్ని చైతన్య చేయడం జరిగింది. గత ప్రభుత్వంలో తెలంగాణ సాంస్కృతిక సారథి లో ఉద్యోగ అవకాశం కోసం అప్పటి చైర్మన్ రసమయి బాలకిషన్, ఎన్నిసార్లు కలిసిన ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటి తెలంగాణ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మరియు సాంస్కృతిక శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు, సాంస్కృతిక సారధి చైర్మన్ గద్దర్ వెన్నెల, తెలంగాణ ఉద్యమకారుల చైర్మన్ కే కేశవరావు, కమిటీ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్.లాంటి గొప్ప నాయకులు చొరవ తీసుకొని నిరుపేద కుటుంబానికి చెందిన ఉద్యమ గాయకుడికి సాంస్కృతిక సారధిలో ఉద్యోగావకాశం కల్పించాలని వేడుకుంటున్నాడు.







# బృందావన్ కాలనీలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పర్యటన



**రాజేంద్రనగర్, విశాలభారతి:** మైలార్దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో శనివారం రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. కాలనీలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను స్వయంగా పరిశీలించిన ఆయన, స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, వీధి దీపాల పరిస్థితిపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను విన్న అనంతరం, సంబంధిత అధికారులకు అక్కడికక్కడే కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల కల్పనపై తక్షణమే దృష్టి సారించాలి. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి. కాలనీల్లో డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి కనీస వసతుల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదు. అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలి," అని సూచించారు. ఈ పర్యటనలో అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య, ఈఈ (ఈ ఈ ), జల మండలి అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక నాయకులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ప్రత్యేక గ్రామ సభలు నిర్వహణ



**శంషాబాద్:** ప్రజా - పాలనా - ప్రగతి నివేదికలో భాగంగా 99 రోజుల ప్రణాళిక కింద శనివారం (06062026) నాడు కవ్వగూడ, పెద్దతుప్ర తండా, పెద్దషాపూర్, అలికోల్ తండా గ్రామ పంచాయితీలలో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా పంచాయితీ అధికారి పెద్దతుప్ర తండా గ్రామ సభకు హాజరై గ్రామంలోని నర్సరీ, వైకుంతధామం, డంపింగ్ యార్డును పరిశీలించి వాటి నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయితీ అధికారి ఎ. రమేష్, గ్రామ సర్పంచ్, వార్డ్ సభ్యులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. అలాగే శంషాబాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీమతి జి. మున్ని కవ్వగూడ గ్రామ సభలో పాల్గొని గ్రామ అభివృద్ధికి సంబంధించిన సూచనలు అందించారు.

## విశ్వబ్రాహ్మణ జాతి రత్నాలను గుర్తించాలి



**ముషీరాబాద్,విశాలభారతి:** విశ్వబ్రాహ్మణ జాతిలో పుట్టి బీసీలకు ఎంతో సేవ చేస్తున్న జాతి రత్నాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి ఉన్నతమైన పదవులు ఇవ్వాలని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి డిమాండ్ చేశారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి జన్మదిన సందర్భంగా శనివారం ఆయనను కలిసిన గణేష్ చారి బర్త్డే విషెస్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ బీసీ కమిషన్ సభ్యులుగా ఉంటూ బీసీలకు విశ్వబ్రాహ్మణులకు ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఇలాంటి సేవ చేస్తున్న వారిని ప్రధాని నరేంద్ర మోడీ గుర్తించి ఉన్నతమైన పదవులను కట్టబెట్టాలని కోరారు. అప్పుడే బీసీ సమాజానికి న్యాయం జరుగుతుందని తెలిపారు. తల్లోజు ఆచారి జాతిరత్నమని బీసీలకు విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆనంతోజు బ్రహ్మాచారి, ముత్తోజు ఆమని, ముత్తోజు అభిషేక్, చెన్నోజు సంతోష్ చారి, ఉమ్మడి సురేంద్ర, వల్లబోజు నరసింహాచారి పాల్గొన్నారు.

## నిరుపేదలకు అపన్న హస్తం కాంగ్రెస్ ప్రభుత్వం

**చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం**

**అశ్వాపురం, విశాలభారతి :** నిరుపేదల సంక్షేమం వారి అభివృద్ధికి అపన్న హస్తం కాంగ్రెస్ ప్రభుత్వమేనని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలులో ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం నిరుపేదల కుటుంబంలో పుట్టిన ఆడబిడ్డలకు చేయూతను అందించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి తన ముందున్న ఏకైక లక్ష్యం అని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందు ఉంచుతానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి సంక్షేమ పథకాన్ని అమలు చేస్తూ ప్రజలకు మరింత చేరువవుతుందన్నారు. అనంతరం పథకానికి ఎంపికైన 38 మంది లబ్ధిదారులకు రూ. 38,42,408 లక్షల చెక్కులను అందజేసారు.



# మార్కెట్ పేరుతో రైతుల భూముల స్వాధీనం అన్యాయం

**మంచిరెడ్డి కిషన్ రెడ్డి**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**



రంగా రెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కోహెడ ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి నాగోల్ పోలీస్ స్టేషన్‌కు తరలించడం ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే చర్య అని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోహెడ ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపనకు విచ్చేయుచున్న నేపథ్యంలో రైతులకు మద్దతుగా నిలిచిన నాయకులను, ప్రజా ప్రతినిధులను అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక ధోరణికి నిదర్శనమని ఆయన ఆరోపించారు. నాగోల్ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు, రైతులను పరామర్శించిన అనంతరం మంచి రెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను వినిపించే హక్కును ప్రభుత్వం పోలీసు బలగాలతో అణచివేసే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రజల గొంతుకను నొక్కివేసి అభివృద్ధి పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం ప్రజాపాలన కాదని, ఇది నిర్బంధ పాలనకు నిదర్శనమని మండిపడ్డారు.

కోహెడ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణాన్ని బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకించలేదని, మార్కెట్ ఏర్పాటుతో రైతులకు, వ్యాపారులకు, పరిసర ప్రాంతాల అభివృద్ధికి ఉపయోగం ఉంటుందని తెలిపారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మార్కెట్ నిర్మాణం కోసం 170 ఎకరాల భూమిని గుర్తించి, చదును చేసి, డీపీఆర్ సిద్ధం చేసినప్పటికీ ఆ భూమిని పక్కనబెట్టి ప్రస్తుతం సర్వే నంబర్ 167లో రైతులు సాగు చేస్తున్న సారవంతమైన భూములను ఎంపిక చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ మూర్ఖత్వానికి నిదర్శనమని విమర్శించారు. రైతుల అభిప్రాయాలను పట్టించుకోకుండా, వారికి సరైన నష్టపరిహారం చెల్లించకుండా మార్కెట్ నిర్మాణం చేపట్టడం అన్యాయమని అన్నారు. రైతుల జీవనాధారమైన భూములను స్వాధీనం చేసుకుంటూ వారిని రోడ్డున పడేయడం అభివృద్ధి కాదన్నారు. రైతుల కన్నీళ్లపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రదర్శనలు చేస్తోందని ఆరోపించారు. రైతులకు మద్దతుగా నష్టపరిహారం ఇవ్వాలని కోరినందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, రైతులను సైతం అరెస్ట్ చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం, నిర్బంధించడం ద్వారా ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని అన్నారు. రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించి, వారి సమ్మతి తీసుకున్న తర్వాతే మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించకపోతే రైతులకు అండగా నిలిచి పెద్ద ఎత్తున ఉద్యమాలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతుల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని, రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా తీసుకునే ప్రతి నిర్ణయాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని మంచిరెడ్డి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# పంటల కొనుగోలు వేగవంతం చేయాలి



**ఎస్ కె సాబీర్ పాషా**

**పాల్వంచ విశాలభారతి:**

ఇసుక కొరతను నివారించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చెయ్యాలని సీపీఐ జిల్లా కార్యదర్శి SK సాబీర్ పాషా కోరారు. శనివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ లో సీపీఐ పాల్వంచ మండల విస్తృత కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఇసుక కొరత వలన అభివృద్ధి పనులు, ఇంద్రమ్మ ఇళ్ల నిర్మాణం, ఇతర నిర్మాణాలకు ఇసుక ప్రధాన సమస్యగా ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే జిల్లా అధికార యంత్రాంగం స్థానికంగా ప్రజల అవసరాలకు ఇసుకను సరఫరా చేసే విధంగా ప్రణాళికలు చేయాలని కోరారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఫారెస్ట్ అధికారులు జిల్లా వ్యాప్తంగా పోడు సాగు దారులపై దాడులు చేసి ఇబ్బందులకు గురి చేయొద్దని, పోడు భూములు సాగు చేసుకునే విధంగా వీలు కల్పించాలని కోరారు. పోడు సాగుదారులపై అటవీశాఖ అధికారులు కవ్వింపు చర్యలకు పాలుపడితే ప్రతిఘటన ఉద్యమాలు తప్పవని తెలిపారు. రైతులు పండించిన పంటను షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో వద్ద సరిపడా కాటాలు, గోని సంచులు, హమాలీలను, లారీలను ఏర్పాటు చేయాలని వ్యవసాయ అధికారులను కోరారు. నిత్యం గ్రామాలలో ప్రజలతో మమేకమవుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల అవగాహన తెచ్చుకొని సమస్యల పరిష్కారానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని తద్వారా పార్టీ మరింత అభివృద్ధి చెందటానికి దోదపడాలని కోరారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కలపనే లక్ష్యంగా స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు కృషి చేస్తున్నారని, కూనంనేని సహకారంతో గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. పాలకుల నిర్లక్ష్య వైఖరి అనాలోచిత నిర్ణయాల వల్ల రోజు రోజుకు నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని విమర్శించారు. ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నష్ట నివారణ చర్యలు చేపట్టి సామాన్యులకు అందుబాటులో ధరలు ఉండే విధంగా ధరల పెరుగుదలపై నియంత్రణ చేయాలని డిమాండ్ చేశారు. అధిక ధరలపై ఈనెల 10వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వేలాదిమంది ప్రజలతో ధర్నా నిర్వహించబోతున్నట్లు తెలిపారు. అడ్డు అదుపు లేకుండా పెరుగుతున్న ధరలను కేంద్ర ప్రభుత్వం నియంత్రించాలంటే ప్రతి గ్రామం నుండి పెద్ద ఎత్తున ప్రజలు ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ముత్యాల విశ్వనాథం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు వీసంశెట్టి పద్మజ, ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, సర్పంచులు షోడే వెంకటరమణ, సరస్వతి, భూక్య ఝాన్సీ, పొందెం నిషా రాణి, తేజావత్ వినోద్, మాలోత్ హరి, బానోత్ విజయ్ కుమార్, బానోత్ మోహన్, అజ్మీర్ శ్రీనివాస్, నవీన్ సిపిఐ మండల నాయకులు వైయస్ గిరి, వేములపల్లి శ్రీనివాస్ రావు, కొంగర అప్పారావు, నిట్ట అమృత రావు, వాజ్జా వాసు, చిల్లా కృష్ణ, చెన్నయ్య, పూనెం రమేష్, కాలం నరసింహారావు, జరపల మోహన్, తేజావత్ శ్రీనివాస్, గూగులోత్ రాములు, లాల్ సింగ్, బాలాజీ, ఎస్కే కాసిం, బొళ్ల ఉపేందర్ రెడ్డి, ఉప సర్పంచులు బానోత్ రంజిత్, భూక్యా రమేష్, జరపల రాంబాబు, ప్రసాద్, యాదగిరి, కందుకూరి శ్రీనివాసరావు, భూక్యా రమేష్, పోతు మార్తి కొమరయ్య, వడ్లకొండ మేరమ్మ, వగ్గేల పద్మ, వజ్జా వెంకన్న, వజ్జా సత్యం, అలెం సమ్మయ్య, ప్రేమ్, వెల్లంకి శివరావు, మందపాటి సత్యనారాయణ, రాజు, మేక రాంబాబు, సాయిలి వెంకన్న, జర్పుల కిషన్, కొంక వెంకటరత్నం, సారయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టపగలు వెలుగుతున్న వీధి దీపాలు

**అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం**



**మొయినాబాద్ , విశాలభారతి:** మొయినాబాద్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతుండటం విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కరెంటు స్తంభాలపై ఏర్పాటు చేసిన వీధి దీపాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు వెలుగుతుండటంతో విలువైన విద్యుత్ వృథా అవుతోందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఒకవైపు విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పిస్తుండగా, మరోవైపు అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజాధనం వృథా కావడం విమర్శలకు తావిస్తోంది. గ్రామంలో వీధి దీపాల నిర్వహణపై సంబంధిత అధికారులు సరైన పర్యవేక్షణ చేయకపోవడమే ఇందుకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా రోజంతా వీధి దీపాలు వెలుగుతుండటంతో లోవోల్టేజ్ సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో పాటు టీవీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు వంటి గృహోపకరణాలు దెబ్బతిని ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వీధి దీపాలకు ఆటోమేటిక్ ఆన్‌ఆఫ్ వ్యవస్థ లేదా టైమర్ స్విచ్‌లను ఏర్పాటు చేసి విద్యుత్ వృథాను అరికట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ప్రజాధనాన్ని కాపాడటంతో పాటు విద్యుత్ సరఫరా సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి

**జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి**



**మొయినాబాద్, విశాలభారతి:** విద్యార్థులకు నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందించేందుకు విద్యాసంస్థలు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రైట్ ఫీల్డ్ ది స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎలుగంటి మధుసూదన్ రెడ్డి పాఠశాలను సందర్శించి విద్యా సదుపాయాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది పాఠశాల స్థాయిలోనే ఏర్పడుతుందని అన్నారు. ఉపాధ్యాయులు తమ బాధ్యతను గుర్తించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీసి ఉన్నత శిఖరాలకు చేరుకునేలా ప్రోత్సహించాలని సూచించారు.ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను కూడా అలవర్చుకోవాలని పేర్కొన్నారు. నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్న స్కూల్ యాజమాన్యాన్ని అభినందిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, కౌన్సిలర్లు పల్లగోళ్ల విజయలక్ష్మిఅశోక్ యాదవ్, షాబాద్ కిషన్, బేగంబీ, వాజీద్, నక్కలపల్లి సర్పంచ్ మంగళారం యాదయ్య, ఉపసర్పంచ్ నిరంజన్ గౌడ్, రేనేట్ల రాజు గౌడ్, పట్నం రాంరెడ్డి, వజీర్, ఎన్‌ఏంఏం గ్రూప్ సీఈవో సలాం ఖలీది, నాయకులు, స్కూల్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# అత్తాపూర్‌లో భార్య హత్య కేసు.. 24 గంటల్లో నిందితుడి అరెస్ట్



**రాజేంద్రనగర్, విశాలభారతి:** అత్తాపూర్ ప్రాంతంలో జరిగిన భార్య హత్య కేసులో పోలీసులు వేగంగా స్పందించి 24 గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన 2026 జూన్ 5వ తేదీ ఉదయం సుమారు 4 గంటల సమయంలో చోటుచేసుకుంది. నిందితుడు అవినాష్ ఇర్బాజీ కాల్నే (37), మహారాష్ట్ర రాష్ట్రానికి చెందినవాడు. అతను ఆటో డ్రైవర్ మరియు మేస్త్రీగా పనిచేస్తున్నాడు. మృతురాలు సోని అలియాస్ కోమల్ అతని భార్య. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసుల వివరాల ప్రకారం, దంపతుల మధ్య కొంతకాలంగా కుటుంబ కలహాలు కొనసాగుతున్నాయి. ఆర్థిక సమస్యలు, నిందితుడి మద్యం అలవాటు, అలాగే భార్య ప్రవర్తనపై అనుమానం కారణంగా తరచూ గొడవలు జరుగుతున్నాయి. గతంలో కూడా మృతురాలిపై దాడి చేసిన కేసు నమోదైంది. జూన్ 4వ తేదీ రాత్రి మరోసారి గొడవ జరిగింది. మరుసటి రోజు తెల్లవారుజామున నిందితుడు కిటికీ ద్వారా గదిలోకి ప్రవేశించి కత్తి, కూరగాయల తొక్కే పరికరం, ఇనుప రాడ్‌తో భార్యపై దాడి చేశాడు. తీవ్ర గాయాల కారణంగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనను గమనించిన పొరుగువారు అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పటికీ, నిందితుడు అక్కడి నుండి పారిపోయాడు. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి, వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. ఆధారాలను సేకరించి, నిందితుడిని 24 గంటల్లో పట్టుకున్నారు. ఘటనలో ఉపయోగించిన ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు దర్యాప్తు డీసీపీ రాజేంద్రనగర్ జోన్ పర్యవేక్షణలో కొనసాగుతోంది. పోలీసుల వేగవంతమైన చర్యలను ఉన్నతాధికారులు ప్రశంసించారు.

# శంషాబాద్‌లో కోళ్ల పందేలు.. 8 మంది అరెస్ట్

**నగదు, కోళ్లు, వాహనాలు స్వాధీనం**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా కోళ్ల పందేలు నిర్వహిస్తున్న 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను శంషాబాద్ ఇన్స్పెక్టర్ కే. నరేందర్ రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, జూన్ 6, 2026న ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో శంషాబాద్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. బూర్జుగడ్డ తండా గ్రామ పరిధిలోని ఒక మామిడి తోటలో కొంతమంది వ్యక్తులు అక్రమంగా బెట్టింగ్ నిర్వహిస్తూ కోళ్ల పందేలు ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. అక్కడ 8 మంది వ్యక్తులు కోళ్ల పందేలు ఆడుతుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో కట్టా దుర్గాప్రసాద్ @ శివ, బండారు హరికృష్ణ, కొక్కిర్లపాటి వర్మ, గొట్టముక్కల మనసా ఫణి వంశీ కృష్ణంరాజు, పలగాని రాంబాబు, సయ్యపురాజు సోమరాజు, సయ్యపురాజు భరత్ శివరామరాజు, దేవులపల్లి సంజయ్ రెడ్డి ఉన్నారు. నిందితుల వద్ద నుండి నగదు రూ. 9,900, 11 కోళ్లు, 8 సెల్‌ఫోన్లు, ఒక కారు, మూడు బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై టీఎస్ స్టేట్ గేమింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు శంషాబాద్ పోలీసులు అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**నల్లబెల్లి, విశాలభారతి:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దస్తగిరిపల్లి గ్రామపంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పులి రమేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏటా రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, కూరగాయల కొనుగోలుకు బుట్టలు, పాల కోసం ఉక్కు పాత్రలను ఉపయోగించాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లు ఇచ్చే దుకాణాలను ప్రోత్సహించవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. నీటిని పొదుపుగా వినియోగించాలని, పంపులను అవసరం లేనప్పుడు వెంటనే ఆపాలని సూచించారు. భూగర్భ జలాల సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని కోరారు. ప్రస్తుతం భూగర్భ జలాలు తగ్గిపోతున్న నేపథ్యంలో నీటి విలువను గుర్తించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామాభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు, గ్రామ పెద్దలు, రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్ గండు ప్రవీణ్, వ్యవసాయ శాఖ అధికారులు రంజిత్, మొగిలి పాల్గొన్నారు.



## నవ్వులు పంచే

# సుధీర్స్ జోకర్

సుడిగాలి సుధీర్ కథానాయకుడిగా 'సుధీర్స్ జోకర్' పేరుతో ఓ సినిమా రూపొందుతున్నది. 'బిగ్‌బాస్'ఫేం అయేషా కథానాయికగా పరిచమం అవుతున్న ఈ చిత్రానికి పీఎస్ సునీల్ పుప్పాల దర్శకుడు. విజయ్ డొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మాతలు. శనివారం చిత్ర కథానాయిక అయేషా పుట్టినరోజు సందర్భంగా, ఇందులో ఆమె పోషిస్తున్న 'షాలినీ' అనే పాత్రను పరిచయం చేస్తూ ఓ స్పెషల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్ ద్వారా ఆమెకు శుభాకాంక్షలు అందించారు. ఈ సినిమాలో షాలినీగా తన నటనతో ప్రేక్షకుల్ని అయేషా అలరిస్తుందని, హాయిగా నవ్వుకునేలా సినిమా ఉంటుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేశారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.